# కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన రేవంత్‌రెడ్డి



**న్యూఢిల్లీ,డిసెంబర్6 :** తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతున్నది. కాంగ్రెస్ హైకమాండ్ నుంచి పిలుపు రావడంతో బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి.. వరుసగా అగ్ర నేతలతో భేటీ అవుతు న్నారు. ఇవాళ ఉదయం కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. కాంగ్రెస్ గౌరవాధ్యక్షురాలు సోనియాగాంధీ, అగ్ర నేత రాహుల్‌గాంధీ, పార్టీ జాతీయ కార్యదర్శి ప్రియాంకా గాంధీలతో ఆయన సమావేశమయ్యారు. తనను సీఎల్పీ నేతగా ప్రకటించిన నేపథ్యంలో వారికి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రేపు (గురువారం) హైదరాబాద్‌లో జరగబోయే తన ప్రమాణస్వీకారానికి వారిని ఆహ్వానించారు. అదేవిధంగా రాష్ట్రంలో మంత్రివర్గం కూర్పు, ఇతర అంశాలపై కూడా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్ నేతలతో చర్చించారు. గురువారం రాష్ట్ర రాజధానిలోని ఎల్బీ స్టేడి యంలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నా రు. ఆ మేరకు రాష్ట్రంలోని ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## తుఫానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### కాబోయే సిఎం రేవంత్‌రెడ్డి సూచన



**హైదరాబాద్,డిసెంబర్6 :** మిగ్‌జాం తుపాను ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉం డాలని, ప్రాణనష్టం జరగకుండా చూడాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓ ప్రకటనలో అధికారులకు సూచించారు. లోతట్టు, ఏజెన్సీ ప్రాంతాల్లో జనజీవనం స్తంభించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పలు ప్రాంతాల్లో ధాన్యం రాశులు తడిసిపోయే అవకాశం ఉందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోందని, ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు దృష్టిపెట్టాలని, ఎక్కడికక్కడ రైతులకు అండగా నిలిచి అవసరమైన సహాయ చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, యాదాద్రి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారా యణపేట, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది. భారీ వర్ష సూచన ఉన్నందున ఆయా జిల్లాల కలెక్టర్లు అధికారులను అప్రమత్తం చేయాలని, పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి ఆహారం, సురక్షిత నీరు అందేలా చూడాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, విద్యుత్, రహదారులు దెబ్బతినే పక్షంలో వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని రేవంత్‌రెడ్డి కోరారు.

## రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారంలో మార్పులు



**హైదరాబాద్,డిసెంబర్6 :** రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకార సమయంలో మార్పులు చేశారు. ముందుగా ప్రకటించిన ప్రకారం గురువారం ఉదయం 10.28 గంటలకు ఎల్బీ స్టేడియంలో ఆయన రాష్ట్ర రెండో ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేయాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఆ సమ యంలో మార్పులు చేశారు. గురువారం మధ్యాహ్నం 1.04 గంటలకు ప్రమాణస్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. అయితే ప్రమాణస్వీకార వేదికలో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. ఎల్బీ స్టేడియంలోనే ఆయన ప్రమాణస్వీకారం కార్యక్రమం జరుగనుంది. నూతన సీఎం ప్రమాణస్వీకారం నేపథ్యంలో ఎల్బీ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి, డీజేపీ, పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు ఎల్బీ స్టేడియానికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఇదిలావుంటే కాబోయే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంకాగాంధీ తదితర అగ్ర నేతలందరినీ విడివిడిగా కలిసి తన ప్రమాణస్వీకర కార్యక్రమానికి ఆహ్వానించారు. అదేవిధంగా రాష్ట్రంలో మంత్రివర్గ కూర్పుపై కూడా వారితో చర్చించారు.

## అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం : గంగుల



**కరీంనగర్,డిసెంబర్6 :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు ఎంతో గొప్పవని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కరీంనగర్‌లోని ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా.బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రాయడంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎంతో శ్రమించారన్నారు. రిజర్వు బ్యాంక్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించి దేశ స్థిరమైన ఆర్థిక వ్యవస్థకు గట్టి పునాదులు వేశారని గుర్తు చేశారు. అలాగే అనేక ఉద్యమాలు చేసి సామాజిక న్యాయం అలుపెరుగని పోరాటం చేశారు. ముఖ్యంగా మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడిన బహుముఖ ప్రజ్ఞశాలి అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సునిల్ రావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఉ

## మోసాలకు పాల్పడుతున్న దళారులను నిలదీయండి



**ములుగు,డిసెంబర్6 :** పత్తి, వరి కొనుగోలులో మోసాలకు పాల్పడుతున్న దళారులు, మిల్లర్లను రైతులు నిలదీయాలని మావోయిస్టు (జేఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన వెలువరించారు. రైతు లు వరి పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే తేమ, ఇసుక, తాలు పేరుతో కోత విధిస్తూ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. మిల్లర్లు ఇష్టారాజ్యంగా కోత విధిస్తు న్నారని పేర్కొన్నారు. సీసీఐ మార్కెట్‌కు తీసుకెళ్లిన పత్తిని ఒకరిద్దరు రైతుల ను ఎంపిక చేసి మిగతా వారిని గాలికి వదిలేస్తోందని, దీన్ని ఆసరాగా చేసుకున్న కొనుగోలుదారులు, పత్తి మిల్లుల యజమానులు సిండికేట్‌గా మారి ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువకు కొంటున్నారని పేర్కొన్నారు. హమాలీ ఖర్చుల కింద క్వింటాకు రూ. 20 అదనంగా వసూలు చేస్తున్నారని, ఈ దోపిడీని మార్చుకోకపోతే రైతులు తిరగబడి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పాలక వర్గాలు ఇవేవీ పట్టించుకోకుండా వ్యాపారుల వద్ద కమిషన్లు తీసుకుంటూ చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా దళారులు, మిల్లర్లు రైతులను మోసం చేసే పద్ధతిని మార్చు కోవాలని, లేనిపక్షంలో ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.

## మిచౌంగ్ తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి

### ఉమ్మడి జిల్లా ప్రజలకు పొంగులేటి శీనన్న సూచన

### ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లకు, సీపీకి ఫోన్

### తాజా పరిస్థితిపై పొంగులేటి ఆరా



**ఖమ్మం,డిసెంబర్6 :** మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్, పాలేరు అసెంబ్లీ ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, ఖమ్మం కలెక్టర్ వీపీ. గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ కు ఫోన్ చేసి ఇక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువుల వెంబడి వరద తాకిడితో ఎలాంటి నష్టం జరగకుండా అక్కడి అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా అధికారులు, సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ.. వరద సహాయక చర్యలను చేపట్టాలని అన్నారు. అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఖ్య పెంచుకుని.. మెరుగైన సేవలు అందేలా చూడాలని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ప్రతిఒక్కరినీ అప్రమత్తం చేయాలని కోరారు.

## ఇంటి గోడ కూలి దంపతుల మృతి

### పొంగులేటి ఆదేశాలతో పరామర్శించి లక్ష పరిహారం అందచేత



**ఖమ్మం,డిసెంబర్6 :** ఖమ్మం జిల్లా నేల కొండపల్లిలో దారుణం జరిగింది. రెండు రోజు లుగా కురిసిన వర్షాలతో చెరువు మాదారంలో నూకతొట్టి పుల్లారావు, లక్ష్మీల ఇల్లు దెబ్బతిని మంగళవారం రాత్రి మట్టిగోడ కూలి మీద పడడంతో ఇంట్లో నిద్రిస్తున్న ఆ దంపతులిద్దరూ దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి బుధవారం వారి మృతదేహాలను సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. మిచౌంగ్ తుపానుతో పడుతున్న వానలకు మట్టిల్లు దెబ్బతిని ఇలా జరిగిందని, నిరుపేదలు చనిపోయారని స్థానికులు వివరించారు. స్పందించిన దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ దుర్ఘటన బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అండగా ఉంటారని అభయమిచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని అభయమిచ్చారు. దయాకర్ రెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, సర్పంచ్ సుజాత ఎంపీటీసీ పుష్పలత, స్థానికులు కృష్ణారెడ్డి, రవి, చంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాము, మరికంటి రమేష్ తదితరులు ఉన్నారు.



## అసెంబ్లీలో గెలిపిన ఎంపిలు లోక్‌సభకు రాజీనామాలు



**న్యూఢిల్లీ,డిసెంబర్6 :** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు లోక్‌సభ, రాజ్యసభ సభ్యత్వాలను వదులుకున్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ ఎంపీలు, పలువురు కేంద్ర మంత్రులు బుధవారం తమ లోక్‌సభ స్థానాలకు రాజీనామా చేశారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఈ నేతలు పార్లమెంట్‌లోని స్పీకర్ కార్యాలయంలో తమ రాజీనామాలను సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 12 మంది బీజేపీ ఎంపీల్లో 10 మంది బుధవారం ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారని, ఆ తర్వాత లోక్‌సభకు రాజీనామాలు సమర్పించారని బీజేపీ వర్గాలు తెలిపాయి. జేపీ నడ్డా వారిని స్పీకర్ కార్యాలయానికి తీసుకెళ్లినట్లు వెల్లడించాయి. కాగా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి రాజీనామా సమర్పించిన వారిలో కేంద్ర మంత్రులు నరేంద్ర తోమర్, ప్రహ్లాద్ పటేల్, ఎంపీలు రితీ పాఠక్, రాకేష్ సింగ్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో గెలిచిన ఉదయ్ ప్రతాప్ సింగ్ ఉన్నారు. అలాగే రాజస్థాన్‌లో పోటీ చేసి విజయం సాధించిన కేంద్ర మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్, దియా కుమార్, ఛత్తీస్‌గఢ్ నుంచి గెలిచిన అరుణ్ సావో ఆన్స్ గోమతి సాయి తమ రాజీనామాలు సమర్పించారు. మరోవైపు రాజ్యసభ ఎంపీగా ఉన్న కిరోరి లాల్ మీనా కూడా రాజ్యసభ ఛైర్మన్‌కు రాజీనామా సమ ర్పించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ఎంపీలు బాబా బాలక్‌నాథ్, రేణుకా సింగ్ ఇంకా రాజీనామాలు సమర్పించలేదు. వారు కూడా రాజీనామాలు చేస్తారని సమాచారం.

## భారత సంస్కృతిని కాంగ్రెస్ అవమానిస్తుంది : అనురాగ్ థాకూర్



**న్యూఢిల్లీ,డిసెంబర్6 :** ఉత్తరాది-దక్షిణాది రాష్ట్రాల మధ్య విపక్షాలు చిచ్చు పెడుతున్నాయని, భారతీయ సంస్కృతి, అస్థిత్వాన్ని అవమానించేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నినట్లు కేంద్ర మంత్రి అనురాగ్ థాకూర్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఓటమి గురించి విశ్లేషణ చేయకుండా.. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాంగ్రెస్ పార్టీ అవమానిస్తుందని మంత్రి అనురాగ్ అన్నారు. ఇవాళ మీడియాతో మాట్లాడుతూ మంత్రి అనురాగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది గురించి అభ్యంతరకర కామెంట్లు చేస్తున్నారని, సనాతన ధర్మాన్ని కూడా కించపరిచారని, అలాంటి ఘటనల పట్ల సీనియర్ కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మౌనంగా ఉన్నారని మంత్రి ఆరోపించారు. వసుదైక కుటుంబం అన్న సందేశాన్ని ప్రధాని మోదీ వ్యాపింపచేస్తున్నారని, కానీ విపక్షాలు మాత్రం తప్పుడు భాషను వాడుతోందని, మూడు రాష్ట్రాల్లో ఓటమికి ఈవీఎంలను నిందిస్తోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై కాంగ్రెస్‌కు నమ్మకం లేదన్నారు. ఓటమి తర్వాత ఆ పార్టీ కారణాలను అన్వేషించలేకపోతున్నదని, వాళ్లు ఈవీఎంలను నిందిస్తున్నారని, సనాతన ధర్మాన్ని, హిందువులను, హిందూ సంస్కృతిని ప్రశ్నిస్తున్నారని కేంద్ర మంత్రి థాకూర్ తెలిపారు.

## భారత రాజ్యాంగం ఎంతో గొప్పది : తమిళిసై



**హైదరాబాద్,డిసెంబర్6 :** ప్రపంచంలోనే భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని తెలుగు తల్లి విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. ముఖ్యంగా మహిళల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. మహిళల అభివృద్ధే నిజమైన అభివృద్ధి అన్న అంబేద్కర్ మాటలను గుర్తు చేశారు.

## గాంధీభవన్ ద్వారా పలువురికి ఆహ్వానాలు

**హైదరాబాద్,డిసెంబర్6 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి ఆహ్వానపత్రాలను గాంధీభవన్ సిద్ధం చేసింది. అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ ముఖ్య నేతలకు గాంధీభవన్ ఆహ్వానాలు పంపింది. రాష్ట్రంలోని అన్ని పార్టీల అధ్యక్షులకు, కొత్తగా ఎన్నికైన 119 మంది ఎమ్మెల్యేలకు సైతం ఇన్విటేషన్లు ఇవ్వనున్నారు. మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలకు సైతం ఆహ్వానాలు పంపనున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని జిల్లాల డీసీసీ అధ్యక్షులకు సైతం ఆహ్వానాలు అందించింది.

## సారీ..సర్ క్షమించండి
## గూమూత్ర వ్యాఖ్యలపై డిఎంకె ఎంపి

**న్యూఢిల్లీ,డిసెంబర్6 :** ఉత్తరాది రాష్ట్రాలను 'గోమూత్ర' రాష్ట్రాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే ఎంపీ డీఎన్వీ సెంథిల్ కుమార్ పార్లమెంటుకు బుధవారంనాడు క్షమాపణ చెప్పారు. తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశారు. రికార్డుల నుంచి తన వ్యాఖ్యలను తొలగించాల్సిందిగా సభాపతిని కోరారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన రెండు బిల్లులపై లోక్‌సభలో మంగళవారంనాడు జరిగిన చర్యలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ గెలిచిన రాష్ట్రాలు హిందీ బెల్ట్‌లో ఉన్నవేనని, వీటిని సహజంగా గోమూత్ర రాష్ట్రాలుగా పిలుస్తామని అన్నారు. బీజేపీ దక్షిణాదికి రాలేదని, అక్కడ ఎలాగూ అడుగు మోపలేరు కాబట్టి ఆయా రాష్ట్రాలను కేంద్ర పాలిత రాష్ట్రాలు చేస్తారనడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదన్నారు. లోక్‌సభలో ఆయన చేసిన వ్యాఖ్యలపై అటు బీజేపీ సభ్యులు మండిపడగా, డీఎంకే భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్ సైతం క్షమాపణ చెప్పాలని ఆయనకు సూచించింది. ఈ నేపథ్యంలో సెంథిల్ కుమార్ లోక్‌సభలో క్షమాపణలు తెలిపారు. నిన్న సభలో చేసిన వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావు. అయితే తన వ్యాఖ్యలు కొందరు వ్యక్తులు, వర్గాల ప్రజల మనోభావాలను గాయపరిచి ఉంటే వాటిని ఉపసంహరించుకునేందుకు సిద్ధంగా ఉన్నాను. నేను చేసిన వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నారు. నా వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నాను' సెంథిల్ కుమార్ లోక్‌సభకు తెలిపారు. లోక్‌సభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన సెంథిల్ కుమార్‌ను డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మందలించినట్టు ఆ పార్టీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. బహిరంగ వ్యాఖ్యలు చేసేటప్పుడు హుందాగా వ్యవహరించాల్సిన అవసరాన్ని పార్టీ పదేపదే చెబుతుంటుందని తెలిపింది. 'ఇండియా' బ్లాక్ కూటమిలో ఉన్న పలువురు నేతలు కూడా డీఎంకే ఎంపీ వ్యాఖ్యలను ఖండించాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఇష్టానికి అనుగుణంగా ఓటు వేస్తారని, వారిని తక్కువ చేసి మాట్లాడటం సరికాదని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ వ్యాఖ్యానించారు. సెంథిల్ కుమార్ తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి, వాటిని ఉపసంహరించుకోవాలి కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు కార్తీ చిదంబరంలో మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.

## కెసిఆర్ సింహంలా మళ్లీ వస్తారు
## కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు

**జనగామ,డిసెంబర్6 :** తాజా ఫలితాలతో కుంగిపోవాల్సిన పనిలేదని, కెసిఆర్ సింహంలా విజృంభిస్తారని మాజీమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మనం తలచుకుంటే ఈ సర్కార్ ఎంత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గందరగోళంలో ఉన్నారని, బీఆర్ఎస్ సర్కార్ రావడం పెద్ద ఇబ్బంది కాదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం నాడు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ సింహంలా బయటకు వస్తారు. సమయం చెప్పలేము. బీఆర్ఎస్ పార్టీకి 39 సీట్లు వచ్చాయి, మా మిత్రులు ఎంఐఎం పార్టీకి 8 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకంగా ఉన్న బీజేపీ పార్టీ సీట్లను, కొందరు అసంతృప్తులను కూడా కలిపితే 56 సీట్లవుతాయి. సింహం రెండడుగులు వెనక్కి వేస్తోందంటే... వేటకు సిద్ధమైనట్టే. కేసీఆర్ అనే సింహం త్వరలోనే బయటకు వస్తుంది. ఎవరూ అధైర్యపడొద్దు' అని కడియం శ్రీహరి ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఈ ఫలితాలు స్పీడ్ బ్రేకర్ మాత్రమే
## ప్రజలు పార్టీని, కెసిఆర్‌ను వదులుకోరు: కెటిఆర్

**రాజన్న సిరిసిల్ల,డిసెంబర్6:** తెలంగాణకు ఉన్న ఏకైక గొంతు కేసీఆర్, బీఆర్ఎస్.. ఆ రెండింటిని ప్రజలు వదులుకోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇది తాత్కాలిక స్పీడ్ బ్రేకర్ మాత్రమే.. ఇది స్వల్ప కాలం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కేటీఆర్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమం సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో అనుకోని ఫలితాలు రావడం సహజం.. నిరాశ పడాల్సిన అవసరం లేదన్నారు. తమ పార్టీ పుట్టిందే పోరాటాల నుంచి, పోరాటాలు తమకేం కొత్త కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన మాట్లాడుతాం అని చెప్పారు. పవర్ పాలిటిక్స్‌లో అధికారం రావడం పోవడం సహజం. ప్రజలు మనకు కూడా రెండు సార్లు అవకాశం ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పాత్రలో కూడా రాణిస్తాం. సిరిసిల్లలో ఓటుకు డబ్బులు, మందు పంచనని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాను అని కేటీఆర్ తెలిపారు.

## పివోకే ఎప్పటికీ మనదే

(మొదటిపేజీ తరువాయి)



తీసుకురావడమే రాజ్యాంగ మూల సూత్రమని పేర్కొన్నారు. దేశంలో 1980 దశకంలో ఉగ్రవాదం తీవ్రంగా పెరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. దేశంలో ఓ భాగాన్ని ఆక్రమించుకుని అక్కడి ప్రజలను నిరాశ్రయుల్ని చేశారని మండిపడ్డారు. కశ్మీరీ పండిట్‌లు తమ సొంత దేశంలో శరణార్థులుగా బతికాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం 46,631 కుటుంబాలు, 1,57,968 మంది తమ సొంత స్థలాలను వదిలి వచ్చారని తెలిపారు. ప్రస్తుత బిల్లులతో వారందరికి హక్కులు కల్పించబడతాయని చెప్పారు. కశ్మీర్‌పై పాకిస్థాన్ 1947లో దాడి చేసింది. ఆ సమయంలో దాదాపు 31,789 కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. 1965, 1971 యుద్ధాల సమయంలో 10,065 కుటుంబాలు వలసబాట పట్టాయి. 1947, 1969, 1971 యుద్ధాల్లో మొత్తం 41,844 కుటుంబాలు శరణార్థులుగా తరలివచ్చాయి. ఈ బిల్లు ఆ ప్రజలకు హక్కులు కల్పించడానికి వచ్చిందే' అని అమిత్ షా అన్నారు.

## కాంగ్రెస్‌లో మంత్రి పదవుల కోసం పోటీ

(మొదటిపేజీ తరువాయి)



డిప్యూటీ సీఎంలు ఎన్ని ఉండాలనే చర్చ కూడా సాగుతోంది. మల్లుభట్టివిక్రమార్క లాంటి వాళ్లు ఒకటే ఉండాలని పట్టుబడుతున్నారు వీటన్నింటిపై ఢిల్లీలో మంతనాలు జరుపుతున్న రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి 10 గంటలకు డీకే శివకుమార్, మాణిక్కం ఠాగూర్‌తో భేటీ అయ్యారు. ఇవాళ మరికొందరితో సమావేశం అయ్యారు. తనకు సీఎం పదవి కట్టబెట్టినందుకు కృతజ్ఞత చెబుతూనే జట్టులో ఎవరెవరు ఉండాలి అనే అంశంపై చర్చిస్తారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్, సోనియా, కేసీ వేణుగోపాల్‌తో సమావేశం కానున్నారు. గురువారం జరగబోయే ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో పాటు, పలు రాష్ట్రాలకు నాయకు లకు కూడా రేవంత్ ఆహ్వానం పంపించనున్నారు. గురువారం ప్రమాణ స్వీకారం చేసిన తర్వా త 9వ తేదీన సోనియాకు కృతజ్ఞత సభ ఏర్పాటు చేయబోతున్నట్టు పార్టీలో చర్చ నడుస్తోంది. దీనిపై అధికారికప్రకటన రానప్పటికీ సభ ఉంటుందని మాత్రం కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# ఎల్బీ స్టేడియంలో సిఎం ప్రమాణ స్వీకారోత్సవం

- ఏర్పాట్లపై సిఎస్ శాంతికుమారి ఉన్నతస్థాయి సమీక్ష
- ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలకు ఆదేశం



**హైదరాబాద్,డిసెంబర్6 :** ఎల్‌బీస్టేడియంలో గురువారం సిఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, మంత్రి మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ సచివాలయంలో సమావేశం నిర్వహించి సమీక్షించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సి.ఎస్ కోరారు. ప్రమాణస్వీకారానికి వచ్చే వారికి తగిన బందోబస్తు, ట్రాఫిక్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. అగ్నిమాపక యంత్రాలు, అగ్నిమాపక శకటాలను వేదిక వద్ద ఉంచాలి. వేదికను శుభ్రపరచడం, త్రాగు నీరు ఫాగింగ్ చేయడం వంటివి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఎల్బీ స్టేడియం వద్దకు వెళ్లే రహదారుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అన్ని సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. అదేవిధంగా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్యా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, ప్రిన్సిపల్ సెక్రటరీలు ఓ రిజ్వీ, శైలజా రామయ్యర్, గవర్నర్ సెక్రటరీ సురేంద్ర మోహన్, సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ శ్రీనివాస్ రాజు, కమిషనర్ అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, ఇతర ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. తరవాత ఏర్పాట్లపై సీ.ఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో ఎల్.బి. స్టేడియంలో ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సమావేశానికి డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజి లు సీ.వి.ఆనంద్, శివధర్ రెడ్డి, నగరపోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్యా, ముఖ్య కార్యదర్శులు శైలజా రామయ్యర్, రిజ్వీ, జలమండలి ఎం.డి దాన కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, సమాచార శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, రాజ్ భవన్ కార్యదర్శి సురేంద్రమోహన్ , వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మల్లు రవి, వెం నరేందర్ రెడ్డి,అంజన్ కుమార్ యాదవ్, శ్రీమతి మున్సీ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ఇతర ప్రముఖులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని అన్నారు, స్టేడియంలో మంచినీటితోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొంటున్నారని, వారికి ప్రత్యేకంగా గ్యాలరీలతోపాటు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. వాహనాల పార్కింగ్, బందోబస్త్ లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు.









## రేవంత్‌రెడ్డి ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)



గాంధీలను కూడా ప్రత్యేకంగా కలిసి ఆహ్వానం పలికారు. మరోవైపు క్యాబినెట్ కూర్పుపై చర్చ జరగలేదని కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ లీ తెలిపారు. ఇదిలావుండగా రేవంత్ ప్రమాణస్వీకారానికి సంబంధించి ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రమాణస్వీకార కార్యక్రమ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరుకావాలంటూ ఏపీ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి.. రేవంత్ ఆహ్వానం పంపారు. ఆయనతోపాటు ఏఐసీసీ నేతలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు, మాజీ సీఎంలు, వివిధ రాజకీయ పార్టీల నేతలకు టీపీసీసీ ఆహ్వానాలు పంపింది. వీరిలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, ఏపీ సీఎం వైఎస్ జగన్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తదితరులు ఉన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను రేవంతే స్వయంగా వెళ్లి ఆహ్వానించారు. వారితో పాటు కాంగ్రెస్ గెలుపులో కృషి చేసిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తదితర మంత్రులను ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆహ్వానించారు. వీరితోపాటు హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకూ టీపీసీసీ ఆహ్వానం పంపింది. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, కంచె ఐలయ్యతో పాటు వివిధ కుల సంఘాల నేతలు, సినీ ప్రముఖులకు ఆహ్వానాలు వెళ్లాయి.

## ప్రజలంతా ప్రమాణ కార్యక్రమానికి రండి



ప్రజలకు బహిరంగ పిలుపునిచ్చిన రేవంత్

**హైదరాబాద్,డిసెంబర్6 :** కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రజలంతా రావాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల పోరాటం, అమరుల త్యాగం, సోనియాగాంధీ ఉక్కు సంకల్పంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అందరి ఆకాంక్షలు నెరవేర్చే ఇందిమ్మ రాజ్య స్థాపనకు సమయం ఆసన్నమైనదని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య, పారదర్శక పాలన అందించేందుకు బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మైనారిటీ, రైతు, మహిళ, యువత్ సంక్షేమ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు మీ అందరి ఆశీస్సులతో 2023 డిసెంబర్ 7న, మధ్యాహ్నం 1.04 గంటలకు హైదరాబాద్ ఎల్బీ సేడియంలో ప్రజా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయబోతోందని రేవంత్ తెలిపారు. ఈ మహోత్సవానికి అందరికీ ఇదే ఆహ్వానం అంటూ రేవంత్ లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో అధికారులు ఎల్బీ స్టేడియంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రేపటి సభలో మూడు వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన వేదికపై రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారు. లెఫ్ట్ సైడ్ 63 సీట్లతో ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తున్నారు. రైట్ సైడ్ వీవీఐపీల కోసం 150 సీట్లతో వేదిక సిద్ధం చేయనున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా 500 మందితో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. గోండు, డప్పు, ఒగ్గు, బోనాలు, షేరీ బ్యాండ్ కళాకారులతో రేవంత్ రెడ్డికి స్వాగతం పలకనున్నారు. అమరవీరుల కుటుంబాల కోసం 300 సీట్లతో ప్రత్యేక గ్యాలరీ సిద్ధం చేస్తున్నారు. తెలంగాణ మేధావులు, ఉద్యమకారుల కోసం 250 సీట్లతో మరో గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నారు. ముప్పై వేల మంది సాధారణ ప్రజలు కూర్చొనే విధంగా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. స్టేడియం బయట వీక్షించేందుకు భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

## మంథనిలో శ్రీధర్‌బాబుదే హవా

ఆయనకు అండగా నిలిచారు. కాంగ్రెస్ వైపు ప్రజలు మొగ్గు చూపారు. అయనకు పరిస్థితులు కూడా కలసి వచ్చాయి. మంథనిలో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పుట్ట మధులు ముచ్చటగా మూడోసారి తలపడ్డారు.. 2009 ఎన్నికల్లో ప్రత్యర్థులుగా ఎన్నికల గోదాలోకి దిగిన శ్రీధర్‌బాబు, మధులు వరుసగా మూడోసారి పోటీకి సిద్ధమయ్యారు. గత రెండు ఎన్నికల్లో టిఆర్ఎస్ తరఫున మధు గెలుపొందారు. 2009లో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాంగ్రెస్ నుంచి, పుట్ట మధు ప్రజారాజ్యం నుంచి పోటీపడగా, మధుపై శ్రీధర్‌బాబు విజయం సాధించారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో శ్రీధర్‌బాబు కాంగ్రెస్ నుంచే పోటీ చేయగా, మధు టీఆర్ఎస్ నుంచి బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో శ్రీధర్‌బాబుపై పుట్ట మధు గెలుపొందారు. ఆ తరవాత 2018, 2023లో మళ్లీ శ్రీధర్ బాబు గెలుపొందారు. సింగరేణి కార్మికులకు ఆయన వెన్నంటి నిలవడం ప్లస్ పాయింట్‌గా మారింది.



## తొలి హామీని నిలబెట్టుకుంటున్న రేవంత్

- దివ్యాంగురాలికి తొలి ఉద్యోగం
- ఎల్బీ స్టేడియంలోకి రావాలని ఆహ్వానం

హైదరాబాద్,డిసెంబర్6 : తెలంగాణలో తొలి ఉద్యోగం నాకే రాబోతున్నందుకు సంతోషంగా ఉంది. రేవంత్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయబోతున్నారు. గాంధీ భవన్ వెళ్లినప్పుడు ఆయన నాకు ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ ఆయన నెరవేరుస్తుండడం హ్యాపీగా ఉందని దివ్యాం గురాలు రజిని ఆనందం వ్యక్తం చేశారు. అధికారంలోకి గనుక వస్తే.. అంటూ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో సర్కార్ ఏర్పాటు అవుతున్న తరుణంలో వాటిని నెరవేర్చేందుకు సిద్ధమై పోయింది. రేపు డిసెంబర్ 7న ఎల్బీ స్టేడియంలో రేవంత్ ప్రమాణం ముఖ్యమంత్రిగా చేయనున్నారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీ హామీలు నెరవేర్చడంపైనా ఆయన స్పష్టమైన ఒక ప్రకటన చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే.. తొలి ఉద్యోగం కూడా ఎవరికి ఇవ్వాలనే దానిపై ఓ క్లారిటీతో ఉన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పాలనలో తొలి ఉద్యోగం రజినీ అనే యువతికి దక్కనుంది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేయాలని అధికార యంత్రాంగాన్ని రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. తొలి ఉద్యోగం రజినీకి ఇస్తాం అని స్వయంగా ప్రకటన చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడా గ్యారెంటీని నెరవేర్చేందుకు రెడీ అయిపోయారు. అక్టోబర్ 17వ తేదీన.. నాంపల్లికి చెందిన రజిని అనే ఓ దివ్యాంగురాలు గాంధీభవన్‌కు వెళ్లి రేవంత్‌రెడ్డిని కలిశారు. రజిని రెండేళ్ల క్రితం పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం వెతుకుతోంది. పీజీ చేసిన తనకు ఇటు ప్రభుత్వంలోనూ అటు ప్రైవేటులోనూ ఉద్యోగం రావట్లేదని తన బాధను టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి చెప్పింది. అప్పుడు రేవంత్ రెడ్డి .. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మొదటి ఉద్యోగం నీకే ఇస్తాం. డిసెంబర్ 9న ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సీఎం ప్రమాణ స్వీకార సభ ఉంటుంది. ఆ సభకు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ వస్తారు. ఆ సభలోనే మొదటి ఉద్యోగం నీకేనమ్మా. ఇది నా గ్యారెంటీ' అంటూ రేవంత్ ఆమెకు హామీ ఇచ్చారు. అంతేకాదు.. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు మీద స్వయంగా ఆయన రజినీ పేరు రాసి.. కింద సంతకం కూడా చేశారు. నెలన్నర తర్వాత.. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో తొలి ఉద్యోగం రజినికే దక్కబోతోంది. కానీ, ప్రమాణ స్వీకారమే రెండు రోజులు ముందుగానే జరుగుతోంది.

# ప్రజాస్వామ్య పునరుద్ధరణకే తొలి విజయం !

తెలంగాణలో ఇప్పుడు ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందుకు తగ్గట్లుగానే మన కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రజాస్వామ్య పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేయడం ద్వారా..చిన్నచిన్న సమస్యలను పరిష్కరించడం ద్వారా ఈ ప్రభుత్వం ముందు తన సచ్ఛీలతను చాటుకోవాలి. ఈనెల 7న సిఎంగా ప్రమాణం చేయబోతున్న రేవంత్ రెడ్డి, మంత్రులుగా ప్రమాణం చేయబోతున్న వారు ముందుగా గ్రామస్థాయిలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం చూపగలగాలి. ప్రజలు తాము కోరుకున్న పని చిన్నదే అయినా అది కాకపోతే దానిని పెద్దగా చూస్తారు. దానిని పదిమందికి చెప్పి పెద్దది చేస్తారు. గత పదేళ్లలో అవినీతి బాగా పెరిగింది. గ్రామపంచాయితీ మొదలు అన్ని కార్యాలయాల్లో అవినీతి బాగా వేళ్లూనుకుంది. కాంగ్రెస్ మంత్రులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. వ్యవస్థను బాగు పర్చాలి. గతంలో కెసిఆర్ అనే నియంత..ఆయన కింద ఉన్న ఛోటా నియంతలైన మంత్రులు, ఎమ్మెల్యేలు అడ్డగోలు సంపాదనలతో ప్రజలను పట్టించుకోలేదు. పోలీసులను గుప్పిట్లో పెట్టుకుని కేసులతో బెదరించారు. తమకు వ్యతిరేకులు అనుకున్న వారిని కేసులతో కోర్టుల చుట్టు తిప్పారు. అందులో మన కాబోయే సిఎం రేవంత్ తదితరులు కూడా బాధితులే. ఇప్పుడా సమస్యలు రాకుండా క్షేత్రస్తాయిలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. గ్రామపంచాయితీ స్థాయిలో చేయి తడపనిదే పని చేయడం లేదు. ఇది అవినీతికి పరాకాష్టగా నిలిచింది. ఈ విషయాలను గతంలో పత్రికల్లో ప్రచారం చేసినా నాటి నియంతలు పట్టించు కోలేదు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తి వల్లనే కాంగ్రెస్ విజయం సాధించింది. నియంతలకు స్థానం లేదని ప్రజలు నిరూపించారు. ఈ అవకాశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వినియోగించుకోవాలి. ప్రజలకు మెరుగైన పాలన అందించేలా చేయాలి. గతంలో కన్నా ఇప్పుడు ప్రజలు ప్రతి విషయాన్ని భూతద్దంలో పెట్టి చూస్తారు. ఎందుకంటే ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చింది. వాటిని మెల్లగా అమలు చేసుకుంటూ పోవాలి. రాజకీయాల్లో పోరాటాలు సహజం. ప్రత్యర్థి పార్టీలను మట్టుపెట్టడం అన్నది ప్రజా స్వామ్యంలో కొత్తేమీ కాదు. కాంగ్రెస్‌ను మట్టి కరిపించిన మోడీ కూడా భారత్ ముక్త కాంగ్రెస్ నినాదంతో ముందుకు సాగుతున్నారు. అయినా కాంగ్రెస్‌ను పూర్తిగా తుడిచిపెట్టలేక పోయారు. తెలంగాణలో బిఆర్ఎస్‌తో అంటకాగి నానాగడ్డి కరిచినందుకు ఆ పార్టీని దెబ్బకొట్టారు. రాజకీయ పార్టీలను చావుదెబ్బ కొట్టడమే లక్ష్యంగా రాజకీయ వ్యూహాలు సాగుతుంటాయి. వాటికి ప్రజల ఆమోదం దక్కితే విజయం సాధిస్తారు. తెలంగాణలో రేవంత్ వ్యూహాలకు ప్రజలు కూడా మద్దతుగా నిలిచారు. కెసిఆర్ అనే అహంభావి ని తరిమికొట్టారు. రేవంత్ ఈ విషయం గుర్తించి తెలివిగా మసలుకుంటే కెసిఆర్ మళ్లీ ఎదగడానికి అవకాశం ఉండదు. అందుకు పాలనాపరమైన శ్రద్ధ తీసుకోవాలి. అవినీతిని దూరంగా పెట్టాలి. టిడిపి నుంచి కాంగ్రెస్ లో చేరిన నాటినుంచే రేవంత్ రెడ్డి కెసిఆర్ కుటుంబ పాలనను అంతమొందిస్తామని ప్రతినబూనారు. అందుకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని వేదికగా చేసుకుని పోరాటం చేశారు. కెసిఆర్ సాగిస్తున్న వ్యక్తి పాలనను, కుటుంబ పాలనను అంగీకరించడానికి ఇది రాచరిక వ్యవస్థ కాదని ప్రజలు ఇచ్చిన తీర్పుతో రేవంత్ నిరూపించగలిగారు. అలాగని ఎవరైనా ఏకవ్యక్తి పాలన సాగిస్తే అంగీకరించే రోజులు పోయాయి. మధ్య ప్రాచ్య దేశాల్లో కూడా ఏకవ్యక్తి పాలన సాగుతున్న దేశాల్లో దాడులు జరిగాయి. నియంతృత్వ పాలనపై తిరుగబాట్లు జరిగాయి. సద్దాంహుస్సేన్, కల్నల్ గడాఫీ లాంటి వారే మట్టి కరిచారు. ఇంకా చెప్పాలంటే పాక్ సైనిక నియంత పర్వేజ్ ముషారఫ్ కూడా ప్రజల తిరుగుబాటులో తోకముడిచారు.

మనదేశంలో ఇందిర నియంతృత్వంపైనా ప్రజలు తిరుగుబాటు చేశారు. బెంగాల్లో వామపక్ష కూటమిని కూకటి వేల్లతో మమతా బెనర్జీ కూల్చి వేశారు. అక్కడ నియంత లేకున్నా నియంతృత్వ పాలన సాగడం కారణంగానే ప్రజలు తిరస్కరించారు. ప్రజలు ఎప్పటికప్పుడు చైతన్యం అవుతూ వస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదరించిన ఎన్టీఆర్‌ను కూడా ప్రజలు తమ ఓటుతో తిరస్కరించారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. కేంద్రంలో కాంగ్రెస్ పదేళ్ల పాలనపై ప్రజలు తిరుగుబాటు చేసి మోడీకి పట్టం కట్టారు. అయితే మోడీ కూడా సీనియర్లను పక్కన పెట్టి పార్టీలో ఏకవ్యక్తి పాలన సాగిస్తున్నారు. ఉమ్మడి నిర్ణయాలు తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారు. దేశంలో ప్రజలు ఎప్పటికప్పుడు పాలకుల నిర్ణయాలపై సమీక్షించుకుంటారు. పాలకుల తప్పిదాలను లెక్కలు వేస్తుంటారు. మోడీ ఏకపక్ష నిర్ణయాలను ప్రజలు గమనించడం లేదని అనుకోవడానికి లేదు. కాంగ్రెస్ చేసిన పాపాల కారణంగానే ప్రజలు దానిని దూరంగా ఉంచారు. అలాగని మళ్లీ ఆదరించరని లేదు. అందుకు తెలంగాణకే ఉదాహరణ. ఇక్కడ కేవలం కెసిఆర్ అహంకారంపై మాత్రమే ప్రజలు తిరుగుబాటు చేశారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కెసిఆర్ నాయకత్వంలో టిఆర్ఎస్‌కు పట్టం కట్టారు. తెలంగాణ ఏర్పడ్డ సమయంలో, అంతకు ముందూ ప్రజల్లో అనేకానేక ఆకాంక్షలు ఉన్నాయి. అవన్నీ సిఎంగా కెసిఆర్ నెరవేర్చడం పక్క పెడితే..ప్రజలకు దూరంగా, కుటుంబానికి దగ్గరగా పాలన సాగించారు. నయా నియంతగా అవతరించారు. తెలంగాణ పోరాట యోధులు, అమరవీరుల ఆకాంక్షలు నెరవేర్చలేక పోయారు. అలాగే తెలంగాణ వచ్చాక ఏ వర్గానికి న్యాయం జరగలేదని.. నిష్ఠుర సత్యం. అందువల్ల అధికారం చేపట్టబోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ గత విధానాలను సమీక్షించుకుని ప్రజారంజక పాలనను సాగించాలి. ప్రజల మనసెరిగిన నేత అయితే వాటిని జాగ్రత్తగా గమనించి సరిదిద్దుకుని ముందుకు సాగుతారు. రేవంత్ రెడ్డి ప్రజల నుంచి వచ్చిన సాదాసీదా మనిషి కనుక ఇవన్నీ ఆకళింపు చేసుకుని పోతాడని ఆశిద్దాం. తన నేతృత్వంతో ఓ మంచి పాలనను అందించే ప్రయత్నం చేయాలని కోరుకుందాం.

# త్యాగమూర్తుల సేవలను గుర్తెరగాలి

**విధివంచితులకు చేయూత అందించాలి**

**డిసెంబర్ 7... సాయుధ దళాల పతాక దినోత్సవం**



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

దేశ మాతృ గౌరవాన్ని కాపాడటానికి, దేశ రక్షణక కోసం, ప్రాణాలను ఫణంగా పెడుతూ, ధైర్యంగా పోరాట బాటలో పయనిస్తున్న సాయుధ యువత, అలాగే అమరవీరుల త్యాగాలను ఎలా విస్మరించగలం. విధి నిర్వహణలో అసువులు బాసిన వారి కుటుంబాలకు, యుద్ధ భూమిలో క్షతగాత్రులకు ఏ మిచ్చి రుణం తీర్చుకోగలం. భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన వెంటనే, ప్రభుత్వం తన రక్షణ సిబ్బంది సంక్షేమాన్ని నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించింది. ఆగష్టు 28, 1949 న, రక్షణ మంత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక కమిటీ ప్రతి సంవత్సరం డిసెంబర్ 7 న ఒక జెండా దినోత్సవాన్ని జరుపు కోవాలని నిర్ణయించింది. 1993 లో, భారత రక్షణ మంత్రిత్వ శాఖ సంబంధిత సంక్షేమ నిధులను ఒకే సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి (ఫ్లాగ్ డే ఫండ్)గా ఏకీకృతం చేసింది. జెండా దినోత్సవాన్ని పాటించడం ద్వారా పౌరులకు చిన్న జెండాలను పంపిణీ చేయడం, విరాళాలు సేకరించడం. దేశం కోసం పోరాడే సాయుధ దళాల సిబ్బంది సంబంధిత కుటుంబాలను, ఆధార పడిన వారిని జాగ్రత్తగా చూసుకోవడం భారత దేశ పౌర బాధ్యత అని భావించి నందున పతాక దినోత్సవం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. వివిధ యుద్ధాలలో, సరిహద్దు రక్షణ, ఉగ్రవాదం, తిరుగు బాటును ఎదుర్కోవడంలో, మన సాయుధ దళాలు వివిధ సందర్భాలలో విలువైన ప్రాణాలను కోల్పోతూనే ఉన్నాయి. ఆ సందర్భాలలో కొద్దిమంది వికలాంగులు కావడం కూడా జరుగుతున్నది. అలాంటి కుటుంబం అనుభవించే బాధలు వర్ణనాతీతం. గాయపడినవారికి పునరావాసము, కల్పించడం, మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబీకుల సంక్షేమము, పునర్నివాసము, కల్పించడం, సర్వీసులో గల సిబ్బంది, వారి కుటుంబీకుల సంక్షేమము ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం.వారి సంరక్షణ, సంక్షేమం, పునరా వాసం జాతి బాధ్యత. అలాగే తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న మాజీ సైనికులు చికిత్స కోసం అధిక వ్యయాన్ని భరించలేని వారు ఉన్నారు. అందువల్ల, వారి సంక్షేమం గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం అనివార్యం. వారిపై ఆధారపడే వారిని చూసుకోవాల్సిన బాధ్యతను ఫ్లాగ్ డే తెరపైకి తెస్తుంది. అట్టి అవసరమైన వారికి సహాయాన్ని అందించడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ చర్యలు సరిపోవు. అందువల్ల, ప్రతి పౌరుడు వారి సంరక్షణ, మద్దతు, పునరావాసం కోసం ఆర్థిక సహాయాన్ని అందించడంలో స్వచ్ఛంద సహకారాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. అందుకే ఈరోజు సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని పాటించడం ద్వారా ఆర్మీ, నేవీ, వైమానిక దళం చేసిన సేవలు గుర్తుకు తెచ్చుకుని, అమరవీరుల, వికలాంగ సిబ్బందిపై ఆధారపడిన వారి పునరావాసం, సంక్షేమాన్ని పట్టించు కోవడం ప్రతి పౌరుడి విధి. రక్షణ మంత్రిత్వ శాఖలో భాగమైన కేంద్రీయ సైనిక్ బోర్డు స్థానిక అధికారుల ద్వారా ఈ నిధుల సేకరణను దేశ.వ్యాప్తంగా నిర్వహిస్తారు. సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్ % పరిపాలనకు కేంద్రియ సైనిక్ బోర్డు బాధ్యత వహిస్తుంది. దీనిని మేనేజింగ్ కమిటీ నిర్వహిస్తుంది. కేంద్రంలో రక్షణ మంత్రి నేతృత్వంలో, రాష్ట్ర / కేంద్రం పాలితాలలో గవర్నర్ / లెఫ్టినెంట్ గవర్నర్ ఆధ్వర్యం వహిస్తారు. భారత ప్రభుత్వ అత్యున్నత సంస్థ అయిన కేంద్రీయ సైనిక్ బోర్డ్ 32 మంది సైనిక్ బోర్డులు, 392 జిల్లా సైనిక్ బోర్డుల ఆద్వర్యంలో దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలకు సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్ నుండి నిధులు సమ కూరుతాయి. కేంద్రంలోని కేంద్రీయ సైనిక్ బోర్డు మాదిరిగానే రాష్ట్ర, జిల్లా సైనిక బోర్డుకు... మాజీ సైనికులు, వితంతువులు మరియు ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాల్లో నివసిస్తున్న వారిపై పునరావాసం, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఆయా సైనిక్ బోర్డులు బాధ్యత వహిస్తాయి.భారత సాయుధ త్రివిధ దళాల...భారత సైన్యం , భారత వైమానిక దళం, భారత నావికాదళం మూడు సేవలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎరుపు, లోతైన నీలం, లేత నీలం రంగులలో చిన్న జెండాలు విరాళాలకు బదులుగా పంపిణీ చేయ బడతాయి. సేకరణ స్వచ్ఛంద సంస్థల ద్వారా అధికారిక, అనధికారిక మార్గాల ద్వారా నిర్వహించ బడుతుంది. దేశ ప్రజల ధన, ప్రాణ, మాన రక్షణకై అంకిత భావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తి స్తూ, విధి వంచితులుగా మారిన త్యాగ మూర్తులకు, వారిపై ఆధార పడిన కుటుంబీకులకు చేయూత అందించాల్సిన అవసరాన్ని, బాధ్యతను దేశ వాసులుగా అందరూ గుర్తించాలి.




# తెలంగాణలో టిడిపి ఇక అంతర్ధానమే

**నేతలు జారుకోవడంతో పార్టీ ఖాళీ**

**పార్టీ బలోపేతంపై ఆశలు వదులుకున్న బాబు**



**హైదరాబాద్,డిసెంబర్6 :** తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ప్రభ ఇప్పుడు పూర్తిగా మసకబారినట్లే. అందులో ఉన్న నాయకులు ఎవరు కూడా పెద్దగా ప్రభావితం చేసే స్థాయిలో లేరు. ఎన్నికలకు ముందు పార్టీలో ఉన్న నేతలంతా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో చేరారు. అలాగే కొందరు సైలెంట్ అయ్యారు. పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ బిఆర్ఎస్‌లో చేరారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కేసులతో జైలుకు వెళ్లడం కూడా ఓ కారణంగా చూడాలి. ఇప్పుడు ఇక్కడ పార్టీని ముందుకు తసీఉకుని వెళ్లే ఆలోచనలో కూడా బాబు ఉన్నట్లు లేదు. ఇకపోతే కొన ఊపిరితో ఉన్న ఆ పార్టీని దెబ్బ కొట్టాలనుకుంటున్న సిఎం కెసిఆర్‌కు పనిలేకుండా రేవంత్ కాగల కార్యం గంధర్వులు చేసె అన్న చందంగా చేసి పెట్టారు. తెలంగాణలో టిడిపి ఎంతో కొంత బలపడాలన్నది ఇక కాని పని. ఎందుకంటే టిడిపిలో ఉన్న వారంతా కొందరు బిఆర్ఎస్‌లో చేరగా మిగిలిన వారంతా కాంగ్రెస్‌లో చేరారు. ఓటర్లు కూడా కాంగ్రెస్ వైపు మళ్లారని ఇటీవలి ఎన్నికల ఫలితాల్లో తేలింది. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి అంతో ఎంతో కొంత ఓటు బ్యాంకు ఉంది. అయితే అది ఎవరికి వెళుతుందన్న దనిపై చర్చలు సాగాయి. గతంలో అది బిఆర్ఎస్‌కు బదిలీ అయ్యింది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు,ఎంపిలు బిఆర్ఎస్‌లో చేరడం వల్ల చాలామంది అటువైపుగా వెళ్లారు. కెసిఆర్ పిలుపుతో అనేకులు పార్టీ మారారు. పరిస్థితి మారడంతో చాలామంది కొందరు రేవంత్ రెడ్డితో కాంగ్రెస్‌లోకి వెళ్లారు. వీరంతా ఓటుబ్యాంకుగా మారారని ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ఎన్టీఆర్‌పై అభిమానంతో కాకున్నా..ఓట్ల కోసం కెసిఆర్ ఆయన పథకాలను కొన్నింటిని పదేపదే స్మరించినా లాభం లేకుండా పోయింది. చివరకు టిడిపి తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీలో చేర్చుకున్నారు. రాజకీయాలలో అలాంటి సెంటిమెంట్లకు తావు ఉండదు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని నిలబెట్టడానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదు. ఎందుకంటే తెలంగాణలో పార్టీ గురించి ఆలోచిస్తూ కూర్చుంటే ఏపీలో తన రాజకీయ భవిష్యత్తుతో పాటు, తన కుమారుడి రాజకీయ భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుంది. అంతేకాకుండా చంద్రబాబును ఆంధ్రా ప్రాంత నాయకుడిగా మాత్రమే తెలంగాణ ప్రజలు చూస్తున్నందున ఆయన స్వయంగా వచ్చి కూర్చున్నా పార్టీని బతికించడం కష్టం. ఈ పరిస్థితులలో తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకులు మాత్రమే పార్టీని గట్టెక్కించుకోవడం కోసం ప్రయత్నించడం లేదా, రేవంత్‌లా దారి చూసుకోవడం తప్పదని గుర్తించారు.రేవంత్ కూడా వ్యూహాత్మ కంగా వారందనినీ కాంగ్రెస్‌లో చేర్చుకున్న తుమ్మల, మండవ లాంటి వారిని చివరి నిముషంలో పార్టీకి రప్పించారు. తెలంగాణకు చెందిన తెలుగుదేశం నాయకులు అధికారానికి దూరమై 14 ఏళ్లు అవుతోంది. కమ్యూనిస్టుల తరహాలో అధికారంపై ఆశ లేకుండా, పార్టీని అంటిపెట్టుకుని ఉండే పరిస్థితి సంప్రదాయ రాజకీయపార్టీల నాయకులకు ఉండదు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ మనుగడ సాగించినా, సాగించకపోయినా చంద్రబాబుకు కూడా వచ్చే నష్టం లేదు.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




**' ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...**

**-ఎడిటర్**

# కోడళ్ళనీ, అల్లుళ్ళని అర్థం చేసుకుందాం



వంట ఇంట్లో ఫోనులో పాటలు వింటూ, మెల్లిగా పాడుకుంటూ వంట చేస్తున్న నేను (రాణి) కాలింగ్ బెల్ చప్పుడుకి ఒక్కసారి ఉలిక్కి పడి ఫోను బందుచేసి తలుపు దగ్గరికి వచ్చిచూస్తే చిన్నమరిది సోమేష్ నిల్చుని ఉన్నడు. జాలి తలుపు కట్క తీస్తే లోపలికి కోపంగా కాళ్ళు పట్ట పట్ట కొట్టుకుంటూ వచ్చి కుర్చీలో కూచున్నడు.ఏమైంది సోమేష్ అని అడిగిన అంతే గొంతు చిన్నగానే ఉన్నా తీవ్రంగా ఉంది. ఆ ముసలోళ్లిద్దరినీ నా ఇంట్లో పడేసింరు. తెచ్చి మీ ఇంట్లో కింద రూంలో పడేసిపోతా. నాకు, నా భార్యకి, పిల్లలకి నరకయాతన ఐతుంది అని ఒకే దండకం ఎత్తుకున్నాడు.నేను మెల్లగా ఒకే మాట చెప్పిన. మీ అమ్మ నాన్నకి మీరు నలుగురు పిల్లలు. మీరు ఏం నిర్ణయము తీసుకుంటరో, ఏం నిర్ణయం తీసుకున్న అది మీ ఇష్టం. నేను అత్తమామ ను ఉండనియ్యను అని ఎప్పుడూ అనలే. ఇట్ల అరవడం మంచిది కాదు. ఐనా మీరు నల్గురు కొడుకులు కదా అన్ని నిర్ణయాలు తీసుకునేది అని నేను అంటూనే ఉన్న కాళ్ళు నేలమీద రాసుకుంటూ జాలి తలుపు తీసుకొని బయటకు పోయిండు.బాధతో నా మనసు గతంలోకి వెళ్ళిపో యింది. ముప్పై ఐదేళ్ల క్రితం మా పెళ్లి జరిగింది. మా వారికి ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్లు. అత్తా మామా ఇద్దరూ ప్రభుత్వ టీచర్లు. ప్రభుత్వ ఉద్యోగమే మనిషి జన్మకి సార్థకత అన్న గట్టి నమ్మకం మా అత్తామామా ఇంకా మా చాలామంది చుట్టాలది. మా వారికేమో అది ఇష్టం లేక లాయర్ గా మా పెళ్లికన్న ఒక సంవత్సరం ముందే ప్రాక్టీస్ మొదలు పెట్టాడు. తనకున్న కలుపుకుని పొయ్యే తత్వం వల్ల బాగనే ఉంది వృత్తిలో. పెళ్లి అయిన మూడు నెల్లకే మా అత్తకి మేముంటున్న జిల్లా కేంద్రంలోనే ఒక స్కూల్ కి ట్రాన్స్ఫర్ అవడమూ దాదాపు ఒక ఆరేళ్లు అత్తతో కలిసి ఉన్న నేను. అప్పుడప్పుడు మామసహజంగానే వీళ్లున్నదగ్గరికి మిగతా ఇంటి సభ్యులు చుట్టపక్కాలు వచ్చిపోతుం దేది.అట్లా ఇంట్లో ఎప్పుడూ సందడిగా ఉండడం మా వారు లాయర్ కావడం వల్ల కూడ వచ్చిపోయే క్లయింట్లు కూడ మా ఇంటి ఉదార వాతావరణంతో ఆఫీస్ రూంలోనే కాకుండా ఇంట్లో అత్త మామ నేను పిల్లలు అందరితో మాట్లాడుతుండేది.ఎందుకో తెలియదు మా వారి ముందు అత్త మామ ఇంకా ఎవరూ కూడ ఏమీ చెప్పేవారు కాదు.అన్ని విషయాలు వారు కోర్టుకు వెళ్లినాక మెల్లిగా నాతోనే దండకాలు మొదలు పెట్టేది. మామనేమో వీడికి మా అన్న లాగా గొప్పలకు పోవుడు, పైసలు ఎక్కువ ఉన్నాయని ప్రదర్శించి పోకడ పోవుడు ఇంటినిండా నోట్లు ఎక్కడ పడితే అక్కడ పెట్టుడు అలవాటు అయింది అనికుర్చీ కి అంటిపెట్టుకొని కూర్చోవాలి వృత్తి అంటే అని అందర్నీ నమ్మకూడదు ఇవన్నీ పాడు లక్షణాలు. నువు చెప్పాలి ఇవి మానుకోమని అని గంటలు గంటలు హితోపదేశం చేసేది. మీరు పెద్దవారు తండ్రి కూడ కదా! మీరే చెప్పచ్చు అంటే వాడిని కట్టుకున్నవు కదా తిట్లు నువే తిని వాడిని చూడాల్సింది నీవే అని నిష్కర్షగా చెప్తుండే. మళ్లీ అత్తమామ నే ఎవరన్న మీ వాడు మంచి తెలివితేటలు కష్టమైన మా కేసు గెలిపిచ్చాడు అంటే వాళ్లకి 70 ఏళ్ల చరిత్ర చెప్పేది. తొక్కు అన్నం రెండుపూటల పెట్టీ కష్టపడి పెంచినం మా కొడుకుల్ని అని.అట్లా కాలం గడిచి అత్తమామ ఉద్యోగ విరమణ కూడ అయింది. వాళ్ళిద్దరూ స్వంత ఊళ్ళో ఉంటున్నారు. ఐనా దాదాపు అన్ని ముఖ్యమైన పండుగలు అయితే మా దగ్గరా లేకుంటే మేము ఊరికి పోవడం ఉంటుండే. ఒక పన్నెండేళ్ళు ఊళ్ళో అందరి సహకారంతో వెళ్ళదీశారు అత్తమామ. ఈ మధ్యలో కళ్ళ ఆపరేషన్లు జారిపడి తుంటి ఎముక ఆపరేషన్లు గుండె జాగ్రత్త ఆపరేషన్లు కొన్నిసార్లు హైదరాబాదులో కొన్నిసార్లు మా దగ్గరా ఇట్ల జరిగినాయి. చివరికి ఎవరో ఒకరి దగ్గర ఉండాల్సిన పరిస్థితి వచ్చినాక మా బావగారూ వారి దగ్గరి బంధువు ఒకరు మంతనాలు జరిపి అత్త మామ దగ్గర ఉన్న డబ్బు, బంగారం ఇద్దరి పెన్షన్ ఊళ్ళో ఉన్న పొలం అన్ని చిన్నకొడుక్కి ఇప్పిస్తం అని చిన్నకొడుకు ఇంటికి నాలుగైదు సార్లు రాయబారం వెళ్లి ఒప్పించారు. ఆ విషయం మిగతా ఇద్దరు కొడుకులకి తెలియదు.అట్లా చిన్నకొడుకు ఇంటికి చేరిన యాడాది లోపు డబ్బు, బంగారం, పొలం కాగితాలు అన్ని చేతిలోకి వచ్చినాక అత్తమామ అనవసరం అనిపించింది వాళ్లకి. అది పద్ధతేనాయే. అందుకే మా వారు ఇంట్లో లేనిది చూసుకొనే వచ్చి ఇట్ల అరిచి పోయాడు మరిది. అనవసరంగా మాట పడ్డం ఎవరికైనా బాధగా ఉంటుందికదా.ఒక ఇంట్లో పుట్టిన సోదరీసోదరులు ఇంటికి చెందిన అన్ని విషయాలు వాళ్ళే చర్చించుకుంటే మంచిది. కోడళ్ళని, ఉంటే అల్లుళ్లనీ ఆ సమస్యల మధ్యకి తెచ్చి ఇబ్బంది పెట్టి మళ్లీ వాళ్ళు కలిసినప్పుడు పకపక నవ్వుతూ మాట్లాడుకు ంటరు కొన్ని ఇళ్ళల్లో. మంచి అలవాటు కాదు కదా. కోడళ్ళు, అల్లుళ్ళను ఇబ్బంది పెడతారు. తల్లిదండ్రులు చేయాల్సిన మొదటి అలవాటు తోబుట్టువుల మధ్య అరమరికలు లేకుండా మాట్లాడే వాతావరణం కల్పించడం. కోడళ్ళు అల్లుళ్లను అర్థం చేసుకోవడం.

**డా. భోజన్నగారి అనసూయ**
**నిజామాబాద్.99898 22494.**

# నిజాం షుగర్స్ బాధ్యత మాదే



**రైతులకు అండగా చర్యలు ఉంటాయి**

**మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి హామీ**

**నిజామాబాద్,డిసెంబర్6 :** బిఆర్ఎస్, బీజేపీ పార్టీ లాగా తమ కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు ఇవ్వదని మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను మభ్యపెట్టి, లేనిపోని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ప్రజాధానాన్ని దుర్వినియోగం చేసిన బిఆర్ఎస్ నాయకులకు ఈ ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో 100రోజులో నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని చెప్పి ఇచ్చిన హామీని కెసిఆర్ తుంగలో తొక్కిందన్నారు. ఫ్యాక్టరీ విషయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లామని, పార్టీ అధికారంలోకి వస్తే తప్పనిసరిగా ఫ్యాక్టరీ తెరిపిస్తామన్నారు. దీనిపై ఇప్పుడు మళ్లీ తమ దృష్టి సారిస్తామని ఆయన అన్నారు. అలాగే చెరకు రైతులకు అండగా ఉంటామని అన్నారు. అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీని నిలబెట్టుకుంటామని అన్నారు. అన్ని పంటలకు బీమా సౌకర్యం కల్పించి బీమా సొమ్మును కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. పేదల సొంతింటి కలను సహకారం చేసేందుకు కొత్తగా ఇళ్లు కట్టుకునే వారికి రూ.5లక్షలు ఆర్థికసా యం అందిస్తామన్నారు.

## ఘనంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం





**కోరుట్ల డిసెంబర్ 06 (ప్రజామంటలు):** అపర శబరిమలగా ప్రఖ్యాతి గాంచిన కోరుట్ల పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతి ఏటా జరుగు ఆరట్టు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వినయ్ శర్మ వైదిక నిర్వహణలో అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా వేములవాడ రోడ్డులోని హనుమాన్ దేవాలయం నుండి మహాదేవ స్వామి ఆలయంలో కోనేటి లోని గణపతి సుబ్రమణ్య స్వామి సమేత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు పాలెపు కార్తిక్ భరద్వాజ్ శర్మ అభిషేకాదులు జరిపి అనంతరం కోరుట్ల పుర వీధుల గుండా ఊరేగింపుగా మేళ తాళాలతో మరియు అయ్యప్ప స్వామి భజన కీర్తనలతో స్వాములు పేటతుల్లి ఆడుకుంటూ స్వామి వారిని ఊరేగించి యధావిధిగా అయ్యప్ప స్వామి దేవాలయానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు చిద్రాల నారాయణ గురు స్వామి, అడహాక్ కమిటీ సభ్యులు గంద్ర రాజేందర్ రావు, కనపర్తి శ్రీనివాస్, నీలి శ్రీనివాస్, శ్రీపతి రమేష్, దగ్గుల నర్సయ్య, గ్యాదే సాయి, కుమార్, సాయిరాం గోపాల్, ఆడెపు శంకర్, అజయ్, వంగ శ్రీధర్, అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఫిట్స్ రావడంతో మోటార్ సైకిల్ పై నుండి పడి వ్యక్తి మృతి



**భీమదేవరపల్లి డిసెంబర్ 06 (ప్రజామంటలు):** మహమ్మద్ రాజ్ మహమ్మద్ (47) అనే కోడిగుడ్ల వ్యాపారి మోటార్ సైకిల్ నుండి కింద పడి మంగళవారం రాత్రి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకెళితే మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజ్ మహమ్మద్ వ్యాపార నిమిత్తం ఈ నెల 3 న, తన మోటార్ సైకిల్ పై కోడిగుడ్లు అమ్ముకొని కొత్తపల్లికి తిరిగి వస్తుండగా, బీసీ కాలనీ దగ్గర బీపీ ఎక్కువై మోటార్ సైకిల్ పై నుండి క్రింద పడిపోయాడు. అంతలో ఫిట్స్ రావడంతో అదే దారిన వెళుతున్న వెంపటి రాకేష్ అనే వ్యక్తి రాజ్ మహమ్మద్ చేతిలో తాళం చేయిపెట్టి విషయాన్ని అతని కుమారునికి తెలియజేశాడు. వెంటనే కుమారుడు మహమ్మద్ అజీజ్ వచ్చి తన తండ్రిని హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, డాక్టర్లు పరీక్షించి మెడ నరాలు చితికిపోయి రక్తం గడ్డకట్టుకుని ఉందని వెంటనే వేరే హాస్పిటల్ కి వెళ్ళమని తెలుపారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తీసుకెళ్లగా అక్కడ వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంతో, గాంధీ హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. రాజు మహమ్మద్ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. భార్య సుల్తానా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు.

## వాహన తనిఖీలు



**మహాదేవపూర్ డిసెంబర్ 06 (ప్రజామంటలు):** మండల కేంద్రంలోని నర్సరీ వద్ద ఎస్సై భవాని సేన్ ఆధ్వర్యంలో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి ఉండాలని సూచించారు. లైసెన్స్ లేకుండా నడిపితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. వాహన పత్రాలు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని డ్రంక్ అండ్ డ్రైవ్ పై సీరియస్ గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఎస్సై తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలి

### అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు





**చిట్యాల/మొగుళ్ళపల్లి/ టేకుమట్ల డిసెంబర్ 06 (ప్రజామంటలు):** మిగ్ జాం (మిచాంగ్) తుఫాను ప్రభావం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధనపు కలెక్టర్ కె. వెంకటే శ్వర్లు సూచించారు. జిల్లాలోని చిట్యాల మండలం గిద్ద ముత్తారం, మొగుళ్ళపల్లి, టేకుమట్ల మండలం ముల్కలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రా లను అధనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తుఫాను ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా ఉండడం వల్ల రెండు, మూడు రోజుల పాటు పెద్ద ఎత్తున ఈదురు గాలులతో కూడిన వర్షాలు జిల్లాలో కురిసే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో తమ పంట తడిసి పాడవకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు టార్పలిన్ కవర్లు అందించి ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## కులం పేరుతో దూశించిన ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలి

### మున్సిపల్ కార్మికుల ధర్నా




**కోరుట్ల డిసెంబర్ 06 (ప్రజామంటలు):** కులం పేరుతో పారిశుధ్య కార్మికుడు చిట్యాల మహేష్ ను చెంప దెబ్బ కొట్టి దూశించిన ఏఎన్ఎం చర్యలు తీసుకోవాలని కోరుట్ల మున్సిపల్ కార్మికులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే కోరుట్ల మున్సిపాలిటీలో పారిశుద్ధ కార్మికునిగా పనిచేస్తున్న చిట్యాల మహేష్ అనే కార్మికున్ని ఏఎన్ఎం ఆర్. మధురిమ దుర్భాషలాడుతూ, చెంప దెబ్బ కొట్టి కులం పేరుతో దూషించిందని ఎందుకు అని అడిగినందుకు నీవు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమని నన్ను ఎవరు ఏమి చేయలేరని అహంకారంతో మాట్లాడిన ఏఎన్ఎం పై చెర్య తీసు కోవాలని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. దీనివల్ల రహదారిపై దాదాపు గంట పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పోలీస్ లు వచ్చి న్యాయం చేస్తామని చెప్పడంతో కార్మికులు అక్కడ నుండి వెళ్లి స్టేషన్లో ఏఎన్ఎం పై ఫిర్యాదు చేశారు.



తెలంగాణ శాసన సభ ఎన్నికలను సమర్ధవంతంగా, అధికారులకు, సిబ్బందికి సమయానుకూలంగా మార్గనిర్దేశనం చేస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా నిర్వహించినందుకు జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత లకు పూలమొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులు

## జీవన్ రెడ్డికి మంత్రి పదవి రావాలని పూజలు



**జగిత్యాల డిసెంబర్ 06 (ప్రజామంటలు):** కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కాంగ్రెసు సీనియర్ నాయకులు తాటిపర్తి జీవన్ రెడ్డికి తెలంగాణలో ఏర్పడబోయే నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవి రావాలని అన్ని మతాల వారు , కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పోరండ్లలోని భీమేశ్వర ఆలయంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఎలాగైనా జీవన్ రెడ్డిని క్యాబినెట్ లోకి తీసుకునేలా చేయాలని వేడుకున్నారు. జగిత్యాల నుండి ఎమ్మెల్యేగా పోటీచేసి పరాజయం పొందినప్పటికి ఎమ్మెల్సీ పదవీకాలం మరో ఏడాదిన్నర కాలం ఉండడాన్ని కాంగ్రెస్ అధిష్టానం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. తెలంగాణ శాసనమండలిలో 40 మంది ఎమ్మెల్సీలకు గాను 28 మంది బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారున్నారని, కాంగ్రెస్ నుండి కేవలం జీవన్ రెడ్డి ఒక్కరే ఉన్నారని, ఆయన ఎమ్మెల్సీగా 40 వేల మెజారిటీతో మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం సాధించి రికార్డ్ సృష్టించారని, కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీని ఆదుకున్న నేతకు తగు ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెసు నాయకులు, కార్యకర్తలు అధిష్టానాన్ని కోరుతున్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో పాటు రెండు సార్లు మంత్రిగా, ఆరు సార్లు ఎమ్మెల్యే గా, ప్రస్తుతం ఎమ్మెల్సీ గా కొనసాగుతున్న జీవన్ రెడ్డి ఎన్నికల్లో ఓడినా, గెలిచినా నిత్యం ప్రజాసేవ లోనే గడుపుతున్నారని, ఆయన అనుభవాన్ని కాంగ్రెస్ అధినేతలు సోనియాగాంధీ, రాహూల్, ప్రియాంకలు గుర్తించాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు.

## చిలకలగూడలో యువతి మిస్సింగ్



**సికింద్రాబాద్ డిసెంబర్ 06 (ప్రజామంటలు):** చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి మిస్సింగ్ అయింది. చిలకలగూడ ఎస్.ఐ పి.కిషోర్ కథనం ప్రకారం..స్థానిక హమాలిబస్తీకి చెందిన ఓ యువతి (23) గత 4 రోజులుగా కనిపించడం లేదని ఆమె తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈనెల 2న వీరి కుటుంబంలోని అంతా తమ, తమ పనులకు బయటకు వెళ్ళిపోగా, ఒంటరిగా ఇంట్లో ఉన్న యువతి ఇంటి నుంచి ఎటో వెళ్ళిపోయిందన్నారు. కాగా రాజు అనే యువకుడిపై తమకు అనుమానం ఉన్నట్లు యువతి తల్లి చెప్పినట్లు ఎస్.ఐ. తెలిపారు. ఫొటోలోని యువతి ఎక్కడైనా కనిపిస్తే తమకు సమాచారం అందించాలని చిలకలగూడ ఎస్.ఐ. కిషోర్ విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్‌లో క్రమశిక్షణ గల కార్యకర్తను

# కొత్తకొండ ఆలయ ఛైర్మన్ పదవి నాకే కేటాయించాలి

### కాంగ్రెస్ జిల్లా నాయకులు గజ్జెల రమేష్



**భీమదేవరపల్లి డిసెంబర్ 06 (ప్రజామంటలు):** కాంగ్రెస్ విద్యార్థి విభాగంలో పనిచేస్తూ పార్టీ అభ్యున్నతికి పాటుపడ్డానని ఉమ్మడి జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు గజ్జెల రమేష్ తెలిపారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలోనే కాంగ్రెస్ అనుబంధ సంఘాలలో అనేక విద్యార్థి సమస్యలపై పోరాటం చేసానని అన్నారు. 2008లో విద్యార్థి కాంగ్రెస్ కళాశాల అధ్యక్షులు, 2009 హుజురాబాద్ ఉపఎన్నికలలో నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో పాదయాత్ర, 2010లో తమిళ నాడు, కేరళ, యూత్ కాంగ్రెస్ ఇంచార్జీ, 2011లో మహారాష్ట్ర యూత్ కాంగ్రెస్ లాతూర్ లోకసభ ఇంచార్జీ, 2012లో ఎన్ఎస్ యుఐ శాతవాహన విశ్వవిద్యాలయం అధ్యక్ష పదవి, 2013లో హుస్నా బాద్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షునిగా, 2014లో కొత్తకొండ దేవస్థానం పాలకవర్గ సభ్యునిగా పనిచేశానని తెలిపారు. 2021లో యువజన కాంగ్రెస్ సభ్యులు వేసిన ఓట్లతో జిల్లా యువజన కాంగ్రెస్ విభాగంలో ఉపాధ్యక్షులుగా గెలుపొందానని అన్నారు. ఇన్నేళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎక్కడ కూడా పార్టీ ప్రతిష్ట ఇబ్బంది కాకుండా క్రమ శిక్షణతో పనిచేసానని వివరించారు. విద్యార్థి, యువజన ఉద్యమంలో, గత అధికార పార్టీ నేతలు ఎన్ని కేసుకు, కుట్రలు చేసినా పార్టీ వీడలేదన్నారు. దళిత కుటుంబానికి చెందిన నాకు రాజకీయంగా ఎదిగేందుకు హుస్నాబాద్ నియోజకవర్గ పొన్నం ప్రభాకర్ గౌడ్ సహకారం అందించాలని కోరారు. జనవరి నెలలో జరిగే కొత్తకొండ జాతర ఛైర్మన్ పదవి లేదంటే గ్రంథాలయ ఛైర్మన్ పదవి కేటాయించాలని ఎంఎల్ఎకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

## గాంధీలో ట్రీట్మెంట్ పొందుతూ అనాధ మహిళ మృతి

### డెడ్ బాడీ మార్చురీకి తరలింపు




**సికింద్రాబాద్ డిసెంబర్ 06 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన ఓ అనాధ మహిళ ఉదంతం ఇది. చిలకలగూడ సబ్ ఇన్ స్పెక్టర్ పి.కిషోర్ కథనం ప్రకారం..బానకొండ అంజమ్మ (61) అనే మహిళ అనారోగ్య సమస్యలతో ఒంటరిగా గాంధీ ఆసుపత్రి ఓపీ సమీపంలోని వెయిటింగ్ హాల్ వద్ద ఉండగా, గమనించిన సెక్యూరిటీ సూపర్ వైజర్ నర్సింహా ఆమెను ఆసుపత్రిలో అడ్మిట్ చేయించారు. అయితే అంజమ్మ చికిత్స పొందుతూ ఈనెల 5న చనిపోయింది. ఆమె వెంట కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో పూర్తి వివరాలు తెలియ రాలేదని, డెడ్ బాడీని మార్చురీకి తరలించి భద్రపరిచామని ఎస్.ఐ తెలిపారు. ఫొటోలోని మహిళను గుర్తు పట్టిన వారు తమను సంప్రదించాలని కోరారు.

## గట్ల నర్సింగాపూర్ గ్రామ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా కవ్వంపల్లి స్వర్ణలత



**భీమదేవరపల్లి డిసెంబర్ 06 (ప్రజామంటలు):** మండలంలోని ముల్కనూర్ గ్రామంలో మండల మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం కార్యకర్తల సమావేశం జరిగింది. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సునీతా రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు బంక సరళ యాదవ్ ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీ నియామకాలు చేపట్టారు. కాగా గట్లనర్సింగాపూర్ గ్రామ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా కవ్వంపల్లి స్వర్ణలత నియమితులయ్యారు. ఆమె నియామక పత్రాన్ని మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు చిదురాల స్వరూప అందజేసారు. తన నియామకానికి సహకరించిన హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సీనియర్ నాయకులు సామల లింగమూర్తి, పొన్నాల మురళి, బొల్లంపల్లి రాజయ్య, కాంతారావు, రాజ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు మాట్ల మంజుల, గిన్నారపు రజిత, కవ్వంపల్లి మమత, చల్లూరి మాలతి తదితరులు పాల్గొన్నారు.

## భారత రత్న, బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి

# రాష్ట్ర వ్యాప్తంగా వర్ధంతి వేడుకలు

### రాజ్యాంగ నిర్మాత ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

**జగిత్యాల డిసెంబర్ 06 (ప్రజామంటలు):** బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో సామాజికంగా ఎదగాలని, ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని అదనపు కలెక్టర్ బి.ఎస్.లత అన్నారు. బుధవారం రోజున జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో బి.అర్. అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనమైన నివాళిలు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ ఎదగాలని, ఆయన రచించిన రాజ్యాంగాన్ని తెలుసుకోవాలని అన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు వేసే విధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరచామని తెలిపారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లు గా నమోదు చేసి ఉత్సాహంగా ఓటు వేశారని, పరిశీలకులు కూడా అభినందించా రని తెలిపారు. ప్రజా స్వామ్యం లో ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం జరగాలని అన్నారు. సమాజంలో మెజారిటీ చెప్పిందే న్యాయమని అన్నారు. మహిళలు ఎక్కువ ప్రతీది గమనిస్తారు అని, గృహంలో కావలసినవి సమకూరుస్తారని, సూక్ష్మంగా ఆలోచన చేస్తారని అన్నారు. వ్యవస్థకు, వ్యక్తి స్వేచ్ఛ కోసం రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. రిజర్వేషన్ లు కల్పించిన వ్యక్తి అని అన్నారు. అంతకుముందు హాజరైన వారందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మి నారాయణ, డిఆర్డిఒ నరేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొని ఘనమైన శ్రద్ధాంజలి ఘటించారు.

### కోరుట్లలో ..

### అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

### కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**కోరుట్ల డిసెంబర్ 06 (ప్రజామంటలు):** మనమందరము సమానమేనని భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను మనమందరం కొనసాగించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పూలమాలలు వేసిన అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానుభావులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే నేడు ప్రతి ఒక్కరం ఓటు హక్కును కలిగి ఉన్నామని తెలిపారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటుతో ప్రజాప్రతినిధిని ఎన్నుకోవడం జరుగుతుందని ఏ దేశంలో కూడా ఈ విధానం లేదన్నారు. పేదవారైనా పెద్దవారైనా తమ ఓట్లను వేసి సరియైన వ్యక్తిని ఎన్నుకోనే విధంగా రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపరిచిన ఆర్టికల్ ద్వారానే తాను ఎమ్మెల్యేను అయ్యానానని అన్నారు. మనకు కులాలు లేవని అందరము సమానమైన అని అంద రం కలిసికట్టుగా కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటు పడుదామని పిలుపునిచ్చారు. తాను ఒక్కడినే ఎమ్మెల్యేను కాదని నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యేలను ఆయన అభిప్రాయాన్ని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాల కోసం తాను కృషి చేస్తానని , యువత ఉపాధి కోసం, విద్యార్థుల విద్య కోసం, సామాన్యుల అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానని హామీ ఇచ్చారు . కొందరు కులాలు మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ని ఘనంగా సన్మానించారు. ఈ వర్ధంతి వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు మోర్తాడు లక్ష్మీనారాయణ, బలిజ పద్మ రాజారెడ్డి, బద్ది సుజాత మురళి, గంధం గంగాధర్, పేర్ల సత్యం, గుండోజి శ్రీనివాస్, జిందం లక్ష్మీనారాయణ, అన్వర్, సజ్జు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు ఉయ్యాల నరసయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్, బి ఆర్ఎస్ నాయకులు పుప్పాల ప్రభాకర్, ఆడెపు మధు, బాబా, రహీం, టీవీ శేఖర్, మురళి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాల, మాదిగ యువజన సంఘాల అధ్యక్షులు కంబ ఆనంద్, బలంతుల సురేష్, మున్సిపల్ అధికారులు బిఆర్ఎస్ నాయకులు, యూత్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### జమ్మికుంటలో...


### రాజ్యాంగ నిర్మాత వర్ధంతి వేడుకలు

భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు దళిత బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహానేత ప్రపంచ మేధావి అంటరానితనం ఆర్థిక సామాజిక వివక్షతలను పారద్రోలిన నవ సమాజ నిర్మాణానికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి అని సేవలను స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరమేష్, శ్రీనివాస్, రామకృష్ణ, రాకేష్, అమరేందర్, సాయి, శ్యామ్, గోపాల్, యూత్ కాంగ్రెస్ నాయకులు మహేష్, వంశీ రమేష్, అంబేద్కర్ సంఘ నాయకులు పోదేటి వేణు మధు తదితర నాయకులు పాల్గొన్నారు.























### జగిత్యాలలో....

### మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

### : కాయితి శంకర్

జగిత్యాల మహనీయుల ఆశయాలను కొనసాగించాలని బిఎస్పీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ అన్నారు. డా.బాబాసాహెబ్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని తహశీల్ చౌరస్తా వద్ద బహుజన్ సమాజ్ పార్టీ జగిత్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాయితి శంకర్ మాట్లాడుతూ అంబేద్కర్ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని, రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో ఉన్నారని వారి కుట్రలను తిప్పి కొట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల పైన ఉందన్నారు. రాబోయే రోజుల్లో అందరికీ సామాజిక న్యాయం అందే విధంగా బహుజన సమాజ్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి సంపత్ కుమార్, పట్టణ అధ్యక్షుడు బొల్లారపు సతీశ్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మ్యాదరి శ్రీహరి, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకుడు కొప్పుల వెంకట రమణ, బిఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఇబ్రహీంపట్నం టీజేఎస్ పార్టీ కార్యాలయంలో...

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని టీజేఎస్ పార్టీ కార్యాలయంలో డా.బీ.ఆర్. అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలాలంకరణ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు చింతకుంట శంకర్, కంతి రమేష్ మాట్లాడుతూ.... అంబేద్కర్ అణగారిన కులాల అభ్యున్నతికి జీవితాన్ని త్యాగం చేశారని ఆయన సేవలు అజరామరమని కొనియాడారు. టీజేఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమలో ఆ పార్టీ మండల అధ్యక్షులు కంతి రమేష్, జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్, టీజేఎస్ రైతు నాయకులు కాట దశరత్ రెడ్డి, కంతి రాజేందర్ కంతి సంజీవ్, మండల్ పార్టీ కార్యదర్శి కలాల ప్రవీణ్ ముదిరాజ్, దాసరి రాములు, గజ్జ రాజశేఖర్, గజ్జ రమేష్, కల్లెడ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

### ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో...

### డా. బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో ఇబ్రహీంపట్నం మండల గౌడ సంఘం అధ్యక్షుడు నేరెళ్ల సుభాష్ గౌడ్, అంబేద్కర్ యువజన సంఘం, ఆధ్వర్యంలో భారత రత్న, బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా వారికివే ఘననివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం యువజన నాయకులు కనుక జగ్గన్న, ఎడ్ల లక్ష్మణ్, బకూరి దశరథం, ఆకు రమేష్, కనుక నాగరాజు, మునుగురు చంద్రయ్య, కనుక రంజిత్, బక్కురి శ్రీనివాస్, పాలెం రమేష్, మునుగురి గణేష్, కనుక లింగన్న, మునుగురి రమేష్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

### హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో..

### రాజ్యాంగ నిర్మాత డా. అంబేద్కర్ కు ఘన నివాళి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ, వర్ధంతిని బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఊస కోయిల ప్రకాష్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పెద్ది వెంకటనారాయణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ యువత రాజ్యాంగ నిర్మాతను ఆదర్శంగా తీసుకొని సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. అంబేద్కర్ భారతదేశ స్థితిగతులను మార్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. విద్య, ఉద్యోగం, సమానత్వం మొదలైన విషయాల్లో అంబేద్కర్ ఒక స్ఫూర్తి తేజంగా అందరికీ ఆదర్శనీయుడన్నారు. అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు.

సమానత్వం యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి గాను నేటి ప్రజలకు అవగాహన కల్పించడానికి భారతదేశంలో అంబేద్కర్ యొక్క వర్ధంతిని జరుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ పొన్నాల హేమలత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిదురాల స్వరూప, చంద్రశేఖర్ గుప్తా, కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, మాడుగుల గోపి, శ్రీరామోజు సమ్మయ్య, గజ్జల సురేష్, పచ్చునూరి కర్ణాకర్, గుడికందుల రాజు, చిట్కూరి అనిల్, ఆదరి రాజేందర్, గిరబోయిన అఖిల్, అంబాల రాజ్ కుమార్, బొల్లంపల్లి రాజ్ కుమార్, షద్రక్, డబ్బా శంకర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సనత్ నగర్ లో...

### అంబేద్కర్ జాతికి చేసిన సేవలు మరవ లేనివి

### మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి

రాజ్యాంగ నిర్మాత డా. అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకొని మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో న్యూబోయిగూడ, ఐడీహెచ్ కాలనీ, పద్మారావునగర్ లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. దళితుల అభ్యున్నతి కోసం అంబేద్కర్ విశేషమైన కృషి చేశారని మర్రి శశిధర్ రెడ్డి కొనియాడారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ చూపిన బాటలో నేటి యువత నడవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర యువమోర్చ నాయకులు మర్రి పురూరవరెడ్డి, డివిజన్ నాయకులు సురేశ్, ప్రవీణ్, కృష్ణ, ఎస్.వై. గిరి, కుర్మ శంకర్, అమర్ నాథ్, గుంటి సత్యనారాయణ, రాజీవ్ దేశ్పాండే, బాబురావు, వెంకట్ రాజ్, ఎస్.చంద్రపాల్ రెడ్డి, కిరీటా, వికాస్, ప్రవీన్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, గోపి శ్రీనివాస్, దొండే సురేశ్, పార్శీ పరమేశ్, మంచాల గోపి, స్వామి, నర్సమ్మ, అండాలు, అనిత, మరియా, నర్సింగ్ రావు, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### సనత్ నగర్ లో....

భారత రాజ్యాంగాన్ని రూపొందించిన బాబా సాహెబ్ డా.బీఆర్. అంబేద్కర్ దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కి ఎంతో కృషి చేశారని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అద్యక్షులు సుదర్శన్ బాబు అన్నారు. బుధవారం రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్. 67వ వర్ధంతి సందర్భంగా బన్సీలాల్ పేట డివిజన్ జబ్బర్ కాంప్లెక్స్ వద్ద డా.బీ.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్మిక, మహిళల హక్కుల కోసం , మానవ హక్కుల పరిరక్షణకు బాబా సాహెబ్అంబేద్కర్ చేసి కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సంఘ సిటీ వైస్ ప్రెసిడెంట్ కుర్మ మహేందర్, ఉద్యోగ సంఘ నాయకులు పురుషోత్తం, రాపాక అశోక్, దేశపాక గోవర్ధన్, సురేశ్, కృష్ణ, సాయిరామ్ పాల్గొన్నారు.

### ఇబ్రహీంపట్నం వర్ష కొండ గ్రామంలో..

ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్ష కొండ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి మానవ హక్కుల ప్రధాత ప్రపంచానికి మనసులంతా సమానమే అని చాటి చెప్పిన బాబాసాహెబ్ అంబేద్కర్ 67 వర్ధంతికి విచ్చేసిన నిషాంత్ కార్తికేయ పూలమాల వేసి వారికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంగిలి పెల్లి లక్ష్మణ్. ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు పొనుకంటి చిన్న వెంకటి. గ్రామపంచాయతీ కార్యదర్శి రాకేష్ .ఏ వై ఎస్ యూత్ సభ్యులు. దొంతుల తుకారాం. దోమకొండ చిన్న రాజన్న. వార్డ్ నెంబర్స్ రమేష్. నాయకులు యువకులు పాల్గొని ఘన నివాళులు అర్పించడం జరిగింది.

## నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

**ధర్మపురి డిసెంబర్ 06 (ప్రజామంటలు):** ధర్మపురికి చెందిన శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి స్వచ్ఛంద సేవా సంస్థ, సేవా కార్యక్రమాలలో భాగంగా, ఆర్థికంగా ఇబ్బంది పడుతూ ఉన్న మూడు కుటుంబాలకి, ఒక్కొక్కోరికి సుమారు రెండు వేల రూపాయల విలువ కలిగిన సుమారు ఇరవై ఐదు రకాల వస్తువులతో కూడిన నిత్యావసర కిరాణా సామాగ్రిని అందించారు. ధర్మపురి మునిసిపల్ పరిధిలో గల హనుమాన్ వాడ, బోయవాడ, కమలాపూర్ చౌరస్తా వద్ద నివాసం ఉంటున్న కట్ట తిరుపతి, కలమడుగు లచ్చన్న, బడుగు రాజమ్మ, ఆర్థికంగా వెనుకబడి ఉండి ఆర్థిక ఇబ్బందులతో, కష్టంగా ఉన్న పరిస్థితులలో ఈ నాలుగు కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందించి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు వారికీ అండగా నిలబడింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు జక్కు రవీందర్, కోరిడే శంకర్ శర్మ,



రంగు లక్ష్మీ నరహరి, పప్పుల శ్రీనివాస్, రంగ హరినాథ్, స్తంభం కాడి జగదీష్, చాడ శ్రీనివాస్, బలిపెల్లి సంతోష్, మాధవి, రమాదేవి లతో పాటు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయమునకు

## రూ. 50,116 విరాళం

**కొడిమ్యాల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రములోని పునర్మిర్మాణం జరుగుచున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయమునకు కొడిమ్యాల గ్రామానికి కు చెందిన మోటురి శంకర్ - హారిక కూతుర్లు శ్రీజ, శ్రీల ల కుటుంబం రాజపోషకులుగా రూ. 50,116 విరాళంగా అందజేశారు. విరాళం అందచేసిన దాతలకు ఆలయ అర్చకులు నాగరాజు రమేష్ స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి మంగళశాసనములు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాతలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు. ఇట్టి విరాళం అందచేసిన దాతలకు కుటుంబానికి గ్రామస్తుల తరుపున భక్తుల తరుపున నిర్మాణ కమిటీ తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసినారు.



prajamantalau daily pages (07-12)_times of varha main (13-2).qxd 12/7/2023 5:04 AM Page 7



# ప్రభుత్వాన్ని మార్చిన యోధులు

## యువతరం సాధించిన రెండవ విజయం.. ఇది తెలంగాణ ఏర్పడ్డాక సాధించిన తొలి విజయం.. సామాజిక తత్వవేత్త

బి.ఎస్. రాములు
బీసీ కమిషన్ తొలి చైర్మన్, తెలంగాణ రాష్ట్రం

ఇది యువతరం సాధించిన రెండవ విజయం. తెలంగాణ సాధించిన తర్వాత ఇది తొలి విజయం. ప్రభుత్వాన్ని మార్చిన యోధులు యువతరం వీరులే. విద్యావంతులు, నిరుద్యోగులు, యువకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వాన్ని మార్చడంలో యుద్ధ యోధులుగా నిలిచారు. యుట్యూబ్ చానల్ యోధులు, యాంకర్లు క్షేత్ర పర్యటనలతో ప్రజలను ఉద్యమకారులుగా అవతారమెత్తి మైండ్‌సెట్ మార్చిన తీరు ప్రశంసనీయం. మహిపాల్ యాదవ్, కాళోజీ టీవి, తొలి తెలుగు వెలుగు రఘు వంటి వందలాది మంది యుట్యూబ్ యాంకర్లు, ఎడిటర్లు క్షేత్ర పర్యటనలో పత్రికలు, టీవీలు అందించని, అందించలేని అనేక విషయాలను బోధించారు. ప్రభుత్వం ఎందుకు మారాలో ఆసరా పథకం వంటి పథకాలు పొందుతున్న వృద్ధులకు, మహిళలకు అర్థం చేయించారు. ప్రభుత్వం యొక్క ఖజానా ఎలా అధికార పార్టీ నాయకుల బుక్కసాలలోకి చేరిపోతున్నదో వివరించారు. ధనిక రాష్ట్రం క్రమంగా పేద రాష్ట్రంగా మారి ఐదు లక్షల కోట్ల రూపాయల అప్పును మనమీద ఎలా వేసిందో చక్కగా వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇసుక మేడల్లా కట్టి ఒక లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలు ఎలా దుర్వినియోగం చేశారో అందులోంచే ఎమ్మెల్యేలను కొనడానికి, అందరికి తాయిలాలు యివ్వడానికి, ఓట్లు కొనడానికి ఎలా ఉపయోగిస్తున్నారో పూస గుచ్చినట్టు వివరించారు.

బర్రెలక్క శిరీష, గద్దర్ కూతురు వెన్నెల బిక్షగాడు వేషంలో ఎమ్మెల్యేలుగా నామినేషన్ వేసిన యువకులు ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఎందరో నిరుద్యోగులు, యువకులు పెద్ద ఎత్తున ఈసారి ఎన్నికల్లో పోటీ చేశారు. డబ్బుల పంపిణీతో గెలవాలనుకున్న వాళ్ళను వీలైనమేరకు అడ్డుకున్నారు. ఇక ఈ పోరాటం ఆగదు. యువతరం ముందుకు కదులుతుంది. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతరం నిలబడుతుంది. ఓస్! ఎన్నికల్లో పోటీ చేయడం అంటే ఇంతేనా? అని యువతరం అర్థం చేసుకుంది. ఎప్పుడైతే డబ్బుతోనే గెలుస్తాం అని భయపెట్టి మైండ్‌సెట్ మారుస్తున్న వాళ్ళ బండారాన్ని బట్టబయలు చేసి, ఎవరైనా పోటీ చేయవచ్చు అని, ఆత్మ విశ్వాసం పెరుగుతున్నది. ఇది గొప్ప శుభపరిణామం. కాన్షీరామ్ చెప్పినట్టు ధన ప్రవాహాన్ని అడ్డుకొని ఇంటింటికి తిరిగి మన ఓటు మనకే, ఓట్లు మావి, సీట్లు మీవా, ఇంకానా! ఇకపై చెల్లదు అని ఒక నోటు ఇచ్చి, ఓటు వేసి పేద యువతరాన్ని గెలిపించండి. మేం మీకు సేవ చేస్తాం. మీకు అందుబాటులో ఉంటాం అని చెప్పే యువతరం ఎదగడం సంతోషం కలిగించే విషయం. కృష్ణా, గోదావరి, తుంగభద్ర, ప్రాణహిత, కావేరి నదులు పుట్టినపుడు పిల్ల కాలువలే. ఆ తర్వాత మహానదులై ప్రవహిస్తున్నాయి. నేటి ఈ చైతన్యం రేపటి మహా ప్రవాహంగా సమాజాన్ని మార్చుతుంది. మలుపు తిప్పుతున్నది. భారత రాజ్యాంగం మహత్తర ఆశయాలను సాకారం చేస్తుంది.

అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేయూతనివ్వడం అవసరం. ఛత్తీస్‌ఘడ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి భారత రాజ్యాంగాన్ని ఉచితంగా అందజేసింది. తెలంగాణలో కూడా సరళమైన భాషలో రాసిన భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ ప్రతిని ప్రతి నియోజక వర్గంలో కనీసం 75 వేల కుటుంబాలకు ఉచితంగా అందించడం అవసరం. లేదా నామమాత్రపు ధరపై అందించాలి. అలాగే కాంగ్రెస్ పార్టీ తిరిగి పార్లమెంటులో, పార్లమెంటు ఎన్నికల్లో గెలవాలంటే ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోను పుస్తకంగా అచ్చువేసి ప్రతి నియోజక వర్గంలో ఇంటింటికి అందించాలి. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ, తమిళ భాషల్లో ప్రింట్ చేసి ప్రతి ఇంటికీ, ప్రతి విద్యార్థికీ అందించడం ద్వారా ప్రజల హృదయాల్లో కాంగ్రెస్ పార్టీ లక్ష్యాలు, సంక్షేమ పథకాలు తెలుస్తాయి. వీటితో పాటు బీసీ కమిషన్ ద్వారా ప్రచురించిన మండల్ కమిషన్, తమిళనాడు కమిషన్, తెలంగాణ కమిషన్ అచ్చువేసిన తెలుగు అనువాదాలను, బీసీ నోట్‌బుక్‌ను లక్షలాది కాపీలు అచ్చువేసి ప్రజలకు అందించి ప్రజల్లో చైతన్యాన్ని పెంచడం ద్వారా ఓటు బ్యాంకు నిర్మించుకోవడం అవసరం. బీసీల కుల గణనకు వెంటనే పూనుకోవడం ద్వారా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో జాతీయ స్థాయిలో గెలుపు అవకాశాలు మెరుగవుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా నియోజక వర్గాల వారీగా ప్రాతినిధ్యం కల్పించే విధంగా చట్టాలు మార్చుకోవాలి. అప్పుడే ప్రాంతీయ అసమానతలు బాగా తగ్గుతాయి.




కేసిఆర్ టిఆర్ఎస్, బిఆర్ఎస్ ఇంతదాకా చేసిన ప్రచారాన్ని ప్రజల్లో కల్పించిన భ్రమలను బట్టబయలు చేయాలి. 416 పథకాల్లో చాలా పథకాలు పేరు గొప్ప, ఊరు దిబ్బ. కొన్ని ఆరంభ శూరత్వం. కొన్ని ప్రారంభించకుండానే అమలైనట్టు భ్రమ కల్పించేవి. ఆసరా, కళ్యాణ లక్ష్మి, గొర్రెలు, చేపల పెంపకం ఓట్ల పంటలు పండించేవి. సిరిసిల్ల చేనేతలకు 12 వందల కోట్లు అని ప్రచారం చేశారు. మిగతా ప్రాంతాల చేనేత కులాలవాళ్ళు సిరిసిల్ల ప్రజలపై ఈర్ష్య పెంచుకున్నారు. కానీ ఆ 12 వందల కోట్లు అనేవి అసలు అమలులోకే రాలేదనేవి ఇతర ప్రాంతాలకు తెలియవు. అలాగే గల్ఫ్ కార్మికులకు 5 వందల కోట్లు నిధిని ఏర్పాటు చేస్తామని అన్నారు. దాన్ని ప్రారంభించనే లేదు. డబుల్ బెడ్‌రూమ్ పథకం పేరు చెప్పి, ఆశ పెట్టి పంచకుండానే, ఇవ్వకుండానే రెండుసార్లు అధికారంలోకి వచ్చారు. ఇలా చెప్తూ పోతే వీటిమీద మరింత వివరంగా ప్రత్యేకంగా రాయాల్సిందే.
ప్రస్తుతం ఒక ముఖ్యాంశం వివరించడానికి పరిమితమవుతాను. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పుల వల్ల ఒక్కొక్క కుటుంబం మీద ఎంత అప్పులు మనమీద వేశారో సోదాహరణంగా వివరించారు. ఆ అప్పులు తీరడానికి ముప్పై యేళ్ళు వడ్డీతో సహా వాయిదా కిస్తులు కట్టాల్సింది మనమే అని చెప్పి, ఇంత చేసిన అప్పుల్లో మనకిచ్చింది ఎంత అని లెక్కలు చూపారు.

తెలంగాణ తలసరి ఆదాయం 3 లక్షల 8 వేలు. 5 గురి కుటుంబం 15 లక్షల 24 వేలు. ఇందులో 45 శాతం రాష్ట్ర ప్రభుత్వం పన్నుల ద్వారా గుంజుతున్నది. కేంద్రం 20 శాతం గుంజుతున్నది. నియోజకవర్గంలో 3 లక్షల ఓటర్లు వుంటే ఒక నియోజకవర్గం ఆదాయం లేదా జీడీపీ 3.08 చొప్పున 3 లక్షల ఓటర్ల ఆధాయం... 9240 కోట్లు.! రాష్ట్రం పన్నుల రూపంలో తీసుకుంటున్నది. 4158 కోట్ల పన్ను రూపంలో తీసుకుంటున్నది. కేంద్రం 2000 కోట్లు పన్ను గుంజుతున్నారు. ఇలా మొత్తం ఒక నియోజక వర్గంలో 6158 కోట్లు, కేంద్రం, రాష్ట్రం పన్నుల రూపంలో తీసుకుంటున్నాయి.

ఇందులో నియోజకవర్గంలో ఎంత ఖర్చు చేస్తున్నారు? కుటుంబాల వారీగా చూస్తే తెలంగాణ రాష్ట్రంలో ప్రతి వ్యక్తి 1.38 లక్షలు రాష్ట్రానికి పన్ను కడుతున్నారు. కేంద్రానికి 70 వేల రూపాయలు పన్ను కడుతున్నారు. ఐదుగురున్న కుటుంబం 6.7 లక్షలు రాష్ట్రానికి, 3 లక్షలు కేంద్రానికి పన్ను కడుతున్నారు.

ఇలా 15.24 లక్షల కుటుంబ ఆదాయంలో 6.85 లక్షలు రాష్ట్రం, 3.2 లక్షలు కేంద్రం పన్నుల ద్వారా గుంజుతున్నది. ఇంతింత పన్నులు గుంజుతున్న రాష్ట్రం, కేంద్రం నియోజకవర్గానికి ఎంత ఖర్చు చేస్తున్నది? సగటున కుటుంబానికి ఎంత ఖర్చు చేస్తున్నది? ప్రతి వ్యక్తికి ఎంత ఖర్చు చేస్తున్నది?

ఇంత ఆదాయం లేదా అప్పు స్వయంగా మనమే తీసుకుంటే వ్యాపారం చేసుకోవచ్చు. ఇల్లు కట్టుకోవచ్చు. ఉన్నత చదువులు చదువుకోవచ్చు. పరిశ్రమలు పెట్టుకోవచ్చు. పెళ్లిళ్ళు చేయొచ్చు. భూములు కొనుక్కొని వ్యవసాయం చేసుకోవచ్చు. కారు, క్యాబ్‌లు కొనుక్కొని నడిపించుకోవచ్చు. ఇలా ప్రజల ఉత్పత్తి, నైపుణ్యాలు, సంపద, ఆదాయం ఎన్నో రూపాల్లో పెంచుకోవచ్చు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో నూటికి రెండు లేదా మూడు రూపాయలు లాభమైనా రావాలను కుంటారు. ఆ లెక్కన మూడు, నాలుగు యేళ్లల్లో ఆదాయం రెట్టింపు అవుతుంది. కానీ ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టింది. అది ప్రజలకు అందేసరికి ఎంతో వృధా అయిపోతున్నది. చేరాల్సినవారికి కాకుండా, ఇతరులకు, ఇతరుల జేబులు నింపుతున్నది. ఉదాహరణకు సబ్సిడీ బియ్యం పథకం నిండా అవినీతిలో కూరుకుపోయి కొనసాగుతున్నది. అవే బియ్యం మళ్ళీ మళ్ళీ కొన్నట్టు, అమ్మినట్టు చూపిస్తూ, వ్యవసాయ పంట ఉత్పత్తి సేకరించినట్టు ప్రజలకు పంపినట్టు కూడా లెక్కలు చూపిస్తున్నారు.

పేద విద్యార్థులకు సకాలంలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం వల్ల యాజమాన్యాలు విద్యార్థులను, తల్లిదండ్రులను అరిగోస పెడుతున్నారు. మానసికంగా కుంగదీస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయమంతా ఎటు పోతున్నది? నెలకు ఆసరా కింద రెండు వేలో, మూడు వేలో, కళ్యాణలక్ష్మి కింద లక్ష రూపాయలో ఇస్తే సరిపోయిందా? పది హేను లక్షల రూపాయల అప్పుల్లో మన కుటుంబానికి ఇచ్చింది ఎంత? ప్రభుత్వ ఆదాయం, ప్రభుత్వం చేసిన అప్పులు కలిపి మనకు చేస్తున్న ఖర్చు ఎంత? ఇలాంటి లెక్కలను ఉద్యమకారులు, నిరుద్యోగ యువత గ్రామగ్రామాన ప్రచారం చేశారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో వివరించారు.

ఒక్కొక్కరు ఒక్కొక్క తీరున ప్రజలకు వివరించిన తీరు గురించి రాస్తే వేల పేజీల డాక్యుమెంటు తయారవుతుంది. ప్రజలు ఎలా ఉన్నారో, ఎలా ఆలోచిస్తున్నారో అనే అంశంపై క్షేత్ర పర్యటన చేస్తూ, కందుకూరి రమేష్ ఇరవై ఐదుకు పైగా వ్యాసాలు రాశారు. కొందరు మేదావులు, జ్యోతిష్యులు అధికార పక్షాన చేరి కారు గుర్తు తప్పక గెలుస్తుందని ఊదరగొట్టి అబాసు పాలయ్యారు. నవ్వుల పాలయ్యారు. హాస్య నటుడు బ్రహ్మానందం సినిమాలోని సన్నివేశాలను చేర్చి కేసిఆర్ మీద, ప్రభుత్వం మీద, వాళ్ల హామీల మీద బోలెడు ఎపిసోడ్‌లు ప్రచారం చేశారు.

తాతా, అమ్మమ్మా! పదిహేను లక్షల అప్పు నెత్తిమీద రుద్ది మీకు మూడు వేల రూపాయలు ఇస్తున్నారు. మీకు మూడు వేలు ఇచ్చి నీ కొడుకును, బిడ్డను, మనవడిని, మనుమరాలిని అంత చదువుకున్న తర్వాత ఉద్యోగం ఇవ్వడంలేదు. వాళ్ళకు ఉద్యోగం ఇస్తే నెలకు ముప్పై వేలు కనీసం జీతం వస్తది. పెళ్లిళ్ళు చేసుకోవచ్చు. మిమ్ముల్ని ఆసరా పథకంతో సంబంధం లేకుండా చక్కగా పోషించుకోవచ్చు. కుటుంబంలో ప్రేమలు పెరుగుతాయి. ఇప్పుడు మీ కొడుకులు, బిడ్డలు, మనుమలు మనుమరాళ్లు ఉద్యోగం లేక లక్షల మంది యేగి తిరుగుతున్నారు. నలభై లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఇందులో సగం మంది చిన్న చిన్న వృత్తులు, పనులు చేసుకొని బతుకుతున్నారు. మిగతా 20 లక్షల మంది ఉద్యోగం కోసం పరీక్షలు రాస్తున్నారు. పరీక్షల కోసం చదువుతున్నారు. కోచింగ్‌లకు పోతున్నారు. అప్పులు చేస్తున్నారు. ముప్పై ఐదు యేండ్లు దాటిపోతున్నాయి. కొందరికి నలభై యేండ్లు దాటినయ్. ఉద్యోగం లేదు. పెండ్లి లేదు. ఉన్నదమ్ముకొని చదివితే ఉద్యోగం లేదు. వీళ్ళందరు ఎట్ల బతకాలె!. మీరు ఈ గులాబి పార్టీని, కేసిఆర్‌ను, కారు గుర్తును ఓడించాలి. ఓడిస్తేనే మాకు ఉద్యోగాలు వస్తయ్. కొత్త ప్రభుత్వం వస్తది అని చెప్తుంటే వృద్దులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు ఆసరా పథకం పొందుతున్న వారు ఆసక్తిగా విన్నారు. అర్థం చేసుకున్నారు.

సగం మంది దాకా కేసిఆర్ కారుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. కాంగ్రెస్ వస్తే ఆసరా ఇంకా ఎక్కువ ఇస్తుంది అని కూడా చెప్పినారు. మీరు ఏ వూరికి పోయినా సరే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం. ఐదు వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ అంటూ ఆరు గ్యారంటీలను అరటిపండు వొలిచినట్టు వివరించినారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారం చేసుకుంటే, మరోవైపు యువతరం వారికన్నా ఎన్నో రెట్లు ప్రభుత్వం మార్పుకోసం ఈ విధంగా అనేక రకాలుగా ప్రచారం చేశారు. వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యుట్యూబ్ ఛానల్, పాటలు, ప్రసంగాలు, చర్చలు ఒక్కటేమిటి తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఎన్ని రకాలుగా ఉద్యమించారో అన్ని రకాలుగా మూడు నెలలు పగలనకా, రాత్రనకా కష్టపడ్డారు. నిజానికి రెండేండ్ల నుంచే ఈ ప్రచారం చేస్తూ వస్తున్నారు. అట్లా రాజకీయాలను, ఆర్థిక అంశాలను ప్రభుత్వానికి మనకు గల సంబంధాన్ని మునుపెన్నడూ లేనంత వివరంగా అర్థం చేయించారు. ఓటు హక్కు యొక్క విలువను తెలిపారు. ఓటు అమ్ముకుంటే నీ బిడ్డను అమ్ముకున్నట్టే. నీ బిడ్డను లంగకు, దొంగకు, తాగుబోతుకు ఇచ్చి లగ్గం చేసినట్టే అని ప్రజల భాషలో చక్కగా విశ్లేషించారు.

ఇలా తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తర్వాత రెండవ విజయం సాధించిన యువతరానికి, మహిళలకు, యుట్యూబర్లకు, కవులకు, కళాకారులకు, నిరుద్యోగులకు, జర్నలిస్టులకు హృదయపూర్వక అభినందనలు.

# 'హ్యాండిల్డ్ ది బాల్' ఔట్..

టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఓ విచిత్రమైన సంఘటన చోటు చేసుకుంది. బంగ్లాదేశ్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఢాకాలోని షేర్ బంగ్లా నేషనల్ స్టేడియంలో చివరి టెస్టు మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్ లో బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ ముష్ఫికర్ రహీమ్ 'హ్యాండిల్డ్ ది బాల్' కారణంగా ఔట్ అయ్యాడు. దీంతో.. టెస్టు క్రికెట్‌లో ఈ విధంగా ఔటైన తొలి బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. క్రికెట్‌లో అతి తక్కువగా కనిపించే ఘటనల్లో ఇదొకటి. బంగ్లాదేశ్, న్యూజిలాండ్ జట్ల మధ్య సిరీస్‌లో రెండో టెస్టు జరుగుతోంది.

ఈ మ్యాచ్‌లో మొదటి రోజు బంగ్లాదేశ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో.. జట్టు స్కోరు 104 పరుగుల వద్ద 4 వికెట్లు కోల్పోయింది. దీంతో జట్టు కష్టాల్లో పడి ఉంది. ఈ క్రమంలో బ్యాటింగ్ కు దిగిన ముష్ఫికర్ రహీమ్ పైనే ఆశలు పెట్టుకున్న జట్టు.. అనవసరమైన ప్రయత్నంతో పెవిలియన్ బాట పట్టాడు. న్యూజిలాండ్ పేసర్ కైల్ జేమీసన్ బౌలింగ్ లో నాల్గో బంతిని రహీం డిఫెన్స్ ఆడాడు. అయితే బంతి బ్యాట్ కు తగిలి వికెట్లకు కొంచెం దూరం పక్కకు వెళ్లింది. దీంతో.. తన వికెట్‌ను కాపాడుకోవడానికి, అతను నేరుగా చేతితో బంతిని దూరంగా నెట్టాడు. దీనిపై న్యూజిలాండ్ ఆటగాళ్లు అప్పీల్ చేయగా.. మైదానంలోని అంపైర్ దానిని థర్డ్ అంపైర్‌కు సూచించాడు.

రివ్యూ అనంతరం ముష్ఫికర్ రహీమ్‌ను థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. ఫీల్డింగ్‌కు ఆటంకం కలిగించినందుకు ఔట్ అయిన తొలి బ్యాట్స్‌మెన్‌గా ముష్ఫికర్ రహీమ్ నిలిచాడు. అయితే.. అప్పటికే బంతి వికెట్‌కు దూరంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బంతిని చేత్తో ఎందుకు తాకాడు అనే ప్రశ్న అభిమానుల మదిలో మెదులుతోంది. కాగా.. 2017లో బ్యాట్స్‌మెన్ తన చేతితో బంతిని తాకితే ఔట్ చేయాలనే నిబంధన ఉండేది.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో ఇండియన్ ప్లేయర్స్ హవా

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో ఇండియన్ ప్లేయర్స్ హవా కొనసాగుతుంది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్‌లో.. టీ20 నెంబర్ వన్ బౌలర్ గా స్పిన్నర్ రవి బిష్ణోయ్ చోటు దక్కించుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్ రషీద్ ఖాన్ ని వెనక్కి నెట్టి నెంబర్ వన్ స్థానంలోకి ఎగబాకాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్‌లో రవి బిష్ణోయ్ 9 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన చేశాడు. ఇదిలా ఉంటే.. టీ20 నెంబర్ వన్ బ్యాట్సమెన్ గా టీమిండియా టాప్ ఆర్డర్ బ్యాట్స్ మెన్ సూర్యకుమార్ యాదవ్ కొనసాగుతున్నాడు. మరోవైపు.. టీమిండియా యువ బ్యాట్స్‌మెన్ రుతురాజ్ గైక్వాడ్ బ్యాట్స్‌మెన్ జాబితాలో టాప్ 10లో తన స్థానాన్ని నిలుపుకున్నాడు. ఐసీసీ వెబ్‌సైట్‌లో తాజా ర్యాంకింగ్స్ ప్రకారం.. బిష్ణోయ్ 699 రేటింగ్ పాయింట్లతో నంబర్ వన్ టీ20 బౌలర్ గా ఉన్నాడు. అంతకు ముందు 665 రేటింగ్‌తో 5వ స్థానంలో కొనసాగాడు. గైక్వాడ్ ప్రస్తుతం ప్రపంచ టీ20 బ్యాట్స్‌మెన్‌గా 7వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. కాగా.. టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానాన్ని ఆక్రమించిన టీమిండియా ఆటగాళ్లలో బిష్ణోయ్ రెండవ ఆటగాడిగా నిలిచాడు. ఇక.. టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ సూర్యకుమార్ యాదవ్ 855 రేటింగ్ పాయింట్లతో నెంబర్ వన్ స్థానంలో ఉండగా.. 787 రేటింగ్ పాయింట్లతో రెండవ స్థానంలో మహ్మద్ రిజ్వాన్ ఉన్నాడు.




## టీ20 సిరీస్ నుంచే రోహిత్‌కు

# టీ20 కెప్టెన్సీ బాధ్యతలు

ఆస్ట్రేలియాతో ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ని 4-1 తేడాతో గెల్చుకున్న టీమిండియా ఇప్పుడు మరో కఠిన సవాలుకు సిద్ధమైంది. దక్షిణాఫ్రికాతో టెస్టులు, వన్డేలు, టీ20లు ఆడేందుకు సఫారీ పర్యటనకు బయలు దేరింది. ఈ టూర్‌లో ముందుగా టీ20, వన్డే సిరీస్‌లు ఆడనున్న భారత్ ఆ తర్వాత టెస్టు సిరీస్ ఆడనుంది. తొలి రెండు సిరీస్‌లకు జట్టులో యువ ఆటగాళ్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. భవిష్యత్‌లో జరిగే కీలక టోర్నీల దృష్ట్యా జట్టును రూపొందించేందుకు సెలక్షన్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనున్నందున, బలమైన జట్టును నిర్మించే బాధ్యత ఇప్పుడు బోర్డుపై ఉంది. అయితే ఈ మెగా క్రికెట్ టోర్నీలో భారత జట్టును ఎవరు నడిపిస్తారన్న ప్రశ్నకు బీసీసీఐ దగ్గర స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. నిజానికి వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాను అత్యంత విజయవంతంగా నడిపించిన రోహిత్ శర్మ.. టీ20 ప్రపంచకప్‌లో కూడా జట్టును నడిపించాలని సెలక్షన్ బోర్డులో మెజారిటీ సభ్యులు కోరుకుంటున్నారు. అయితే దీనిపై ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఏడాది కాలంగా టీ20 జట్టుకు దూరంగా ఉన్న రోహిత్ శర్మ కూడా టీ20 ప్రపంచకప్ ఆడటంపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. అయితే ఇప్పుడు బయటకు వచ్చిన సమాచారం ప్రకారం.. 2024లో టీ20 వరల్డ్ కప్ ఆడే విషయంలో తన స్థానం ఏమిటో బీసీసీఐకి రోహిత్ చెప్పినట్లు సమాచారం. 2023 ప్రపంచకప్‌లో టీమిండియా ప్రదర్శనను సమీక్షించేందుకు ఇటీవల బీసీసీఐ అధికారులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జట్టు భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమావేశంలో కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంలోనే రోహిత్ శర్మ రాబోయే %u%20 ప్రపంచ కప్ ఆడటం గురించి బోర్డుతో మాట్లాడాడు. 'మీరు నన్ను %u%20 ప్రపంచ కప్‌కు ఎంపిక చేయాలనుకుంటే, దాని గురించి ఇప్పుడే చెప్పేయండి' అని అడిగాడు. నివేదిక ప్రకారం, సమావేశంలో పాల్గొన్న అధికారులందరూ, సెలెక్టర్లు మరియు కోచ్ రాహుల్ ద్రవిడ్ కూడా రోహిత్ శర్మకు %u%20 ప్రపంచ కప్ కెప్టెన్సీ బాధ్యతలు అవ్వగించడానికి ఏకగ్రీవంగా అంగీకరించారు. దక్షిణాఫ్రికాతో జరిగే టీ20 సిరీస్ నుంచే రోహిత్ టీమ్ ఇండియా టీ20 కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాలని సెలక్టర్లు భావించారు. అయితే రోహిత్ కొద్దిరోజులు విరామం కోరినట్లు సమాచారం. ఇక దక్షిణాఫ్రికాతో జరిగే టీ20, వన్డే సిరీస్‌లలో రోహిత్ శర్మ ఆడడం లేదు. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో అతను నేరుగా భారత జట్టు బాధ్యతలు చేపట్టనున్నాడు. రోహిత్ అభ్యర్థన మేరకు సెలెక్టర్లు దక్షిణాఫ్రికాతో జరిగే మూడు టీ20ల సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్సీని అప్పగించారు. వన్డే సిరీస్‌కు కేఎల్ రాహుల్ బాధ్యతలు చేపట్టనున్నాడు.




PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com